ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 29 | సంచిక : 5 | జనవరి 2024

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు
శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥ 150/-
విడి ప్రతి : రు॥ 15/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు – 534 265
9441122622
7780639977

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

డిజైనింగ్
అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్
(నందిగామ శేషసాయి)
పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,
పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

స్వభావం - అలవాట్ల యొక్క వేగం ............................. 2


సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 5

భగవద్గీత ........................................................... 27


**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



కాలము నేను అని
భగవంతుడు చెప్పాడు.
ఎవరైతే కాలమును
దుర్వినియోగం
చేస్తున్నారో, వారు
భగవంతుడిని
అవమానించినట్లు
లెక్క. ఒక్క క్షణం కూడా కాలమును పాడుచేసుకోవద్దు.



# స్వభావం - అలవాట్ల యొక్క వేగం

స్వభావాన్ని మార్చుకోవటం ఎంత కష్టమో అర్థమవ్వటానికి పురాణాలలో ఒక కథ చెపుతారు. అన్ని కథల కంటే ఈ కథ నాకు ఎక్కువ ఇష్టం (అన్నారు నాన్నగారు). ఈ కథ ఒక్కటే జ్ఞాపకం ఉంచుకొని మిగతావి అన్నీ మరిచిపోయినా పరవాలేదు. ఈ కథ మీరు మీ ముక్కులో గాలి పూర్తిగా బయటికి పోయేవరకు అంటే మీరు జీవించి ఉన్నంతకాలం జ్ఞాపకం పెట్టుకోవాలి అన్నారు. ఆ తేలు-తాబేలు కథ నాన్నగారి మాటలలో ....

ఒక చిన్న నది పక్క నుంచి ఒక తేలు అవతలి ఒడ్డుకి వెళ్ళటానికి చూస్తోంది. తేలుకి కుట్టటం చేతనవును కాని ఈత చేతకాదు. అవతలి ఒడ్డుకి వెళ్ళాలి, మనకి ఈత రాదు ఎలాగ అని ఆలోచిస్తోంది. అంతలో ఒక తాబేలు ఆ ఒడ్డుకి వచ్చింది. ఓ తాబేలూ! నేను ఆ పక్కకి వెళ్ళాలి, కానీ ఈత రాదు. నువ్వు నాకొక సహాయం చెయ్యాలి. నీ వీపు మీద కూర్చుంటాను, నన్ను ఆ పక్కకి తీసుకెళ్ళు అంది. అప్పుడు తాబేలు, నీ స్వభావం నాకు తెలుసు, నువ్వు ఎలా కుడతావో తెలుసు, నీతో నేనెక్కడ బాధ పడగలను, నేను తీసుకెళ్లనని చెప్పింది. నాకు కుట్టే అలవాటు ఉన్నమాట నిజమే, కానీ నువ్వు నాకు ఉపకారం చేస్తున్నావు, నిన్నెందుకు కుడతాను అందట తేలు.

కుట్టటం అనేది నాకు అలవాటు, మామూలుగా అయితే కుట్టేస్తాను. కాని, నన్ను ఆ పక్కకి తీసుకెళ్ళి నువ్వు నాకు ఉపకారం చేస్తుంటే నిన్ను ఎలా కుడతాను అని ఆ తేలు కోర్టులో ప్లీడరులా ఆర్గ్యుమెంట్ బాగానే చెప్పింది. నేను ఉపకారం చేస్తున్నాను కదా అనుకుంది పాపం తాబేలు. నువ్వు నిజంగా చెపుతున్నావా, మళ్ళీ దారిలో కుట్టేస్తే ఆ బాధ పడలేను అంది తాబేలు. తేలుకుడితే శరీరం అంతా మంటలు వచ్చేస్తాయి. నేను నిజంగా చెపుతున్నాను,

నాకు సహాయం చేసిపెట్టు అని తేలు చెపితే తాబేలు నమ్ముతుంది. అయితే నా వీపు మీద కూర్చో, ఆ పక్క ఒడ్డున నిన్ను దింపేస్తాను అని తాబేలు అంది. తాబేలు వీపు పైన ఉన్న పెంకు మీద కూర్చుంది తేలు. ఆ పెంకు మీద కుట్టినా తాబేలుకేమీ అనిపించదు. తాబేలు పీక (మెడ) పైకెత్తి ఈదుకొంటూ వెళ్తోంది నదిలో. సగం దూరం వచ్చింది. తేలు పైన కూర్చుంది కదా, దాని స్వభావం కుట్టటం, దానికి మనస్సులో కుట్టాలనే బుద్ధి వచ్చేస్తోంది. ఆ పీక దగ్గర కుట్టేద్దాము అని చూస్తోంది. మళ్ళీ, అయ్యో మాట ఇచ్చాము కదా, కుట్టేస్తే ఎలా అనుకుంటోంది! మనం కూడా అంతే! అది రెండూ అనుకుంటోంది. మాట ఇచ్చాము కుట్టకూడదు అని, పైగా మనకి ఉపకారం చేస్తోంది అని అనుకుంటోంది. అయితే లోపల దానికి కుట్టే స్వభావం ఉంది కదా, తాబేలుని నది మధ్యవరకూ వెళ్ళనిచ్చి అప్పుడు కుట్టేసింది!

నీ స్వభావాన్ని నిగ్రహించుకోవాలి అనుకుంటే నువ్వు నిగ్రహించుకోగలవా అన్నాడు పరమాత్మ. ఒకో మనిషికి ఒకో స్వభావం ఉంటుంది. ఆ స్వభావం లోనుంచి బయటికి రావటం అంటే సామాన్యం కాదు. నీతోటి నువ్వు పోరాడాలి. బ్రతికుండగా కాలిపోయి మళ్ళీ ఆ శరీరంలోనే పుడితే అప్పుడు స్వభావం మారుతుంది. అంత కష్టం స్వభావం మార్చుకోవటం. మీకు అర్థం అవుతోందా. నిగ్రహం కిం కరిష్యతి! ఊరికే నేను నిగ్రహించుకుంటాను, నేను కంట్రోల్ చేసుకుంటాను అంటే అది అంత తేలిక కాదు స్వభావాన్ని మార్చుకోవటం.నీ దగ్గర ఉన్న డబ్బు వల్ల, నువ్వు అనుకునే మాటలు వల్ల, లేకపోతే పుస్తకాలు చదవటం వల్ల నీ స్వభావం మారదు. ఎంతో కష్టపడి సాధన చేసినా స్వభావం మారుతుందో లేదో చెప్పలేము.

తేలుకి కుట్టటం దాని స్వభావం. కుట్టేద్దాము అనుకుంటోంది. మళ్ళీ మనం ఇచ్చిన మాట పోషించుకోవాలని జ్ఞాపకం వస్తోంది. మాట ఇచ్చాము అన్న విషయం పక్కన పెట్టేసి, కుట్టేసింది. ఇట్ ఈజ్ ఫోర్స్ ఆఫ్ హాబిట్! దాని అలవాటు యొక్క వేగం. కనిపించిన వాళ్ళనల్లా కుట్టేయటం దానికి అలవాటు. పాపం తాబేలుకి విపరీతమైన మంట వచ్చేసింది. ఆ మంట భరించలేక తలకాయ నీటిలో పెట్టి కుదిపేసుకుంటే పైనున్న తేలు నీటిలో పడి కొట్టుకుపోతోంది. ఓ తేలూ, నువ్వు నాకు ఇచ్చిన మాట ఏంటి, నువ్వు చేసిన పని ఏంటి అంది తాబేలు. అప్పుడు తేలు అంటుంది పాపం, నిన్ను కుట్టటం వల్ల నాకే నష్టం వచ్చింది, కదా. నేనే నీటిలో కొట్టుకెళ్ళిపోతున్నాను. అలా కుట్టటం తప్పు కదా అని నువ్వు అడుగుతున్నావు. నేను కుట్టను అని చెప్పిన మాట నిజమే. ఓ తాబేలూ, నువ్వు చెప్పింది లాజిక్. నువ్వు చెప్పింది న్యాయంగానే చెపుతున్నావు. నేను కూడా నీకు న్యాయంగానే కుట్టను అని చెప్పాను. కుట్టటం నా పొరపాటే. నీకిచ్చిన మాట నేను పోషించుకోలేక పోయాను అని నాకు తెలుస్తోంది. కాని స్వభావం ముందు, అలవాట్ల ముందు, లాజిక్ ఏమి చేస్తుంది తాబేలూ! వండర్ఫుల్ ఎక్స్ప్రెషన్! నా అలవాట్లు ఒక రోజులో పోతాయా! నువ్వు నాకు ఉపకారం చేస్తున్నావు అని తెలుస్తోంది కాని నా అలవాటు

నన్ను ఎదరికి గెంటేస్తోంది. ఇట్ ఈజ్ ఏ ఫోర్స్ ఆఫ్ హాబిట్!

అలవాట్లు అన్నీ కలిసి క్యారెక్టర్ కింద మారుతాయి. కుట్టటమే నా క్యారెక్టర్ అయిపోయింది. కనిపించిన వాళ్లనల్లా, వాళ్ళు నాకు అపకారం చేయకపోయినా, కుట్టేస్తాను. ఎందుచేతనంటే, ఇట్ ఈజ్ ఎ పార్ట్ ఆఫ్ మై క్యారెక్టర్. నిన్ను కుట్టను అని చెప్పాను, నాకు మాట ఇచ్చి కుట్టేసావు అని నువ్వు చెపుతున్నావు. నీ మాటలు నా మాటలు కూడా బాగానే ఉన్నాయి, కాని ఈ అలవాట్లు ఎక్కడికి పోతాయి అని అడిగింది. లాజిక్ ఇద్దరు చెప్పేదీ బాగుంది. కానీ ఈ లాజిక్ వల్ల అలవాట్లు పోతాయా. నిన్ను కుట్టటం తప్పని నాకు తెలుస్తోంది, ఇప్పుడు నాకే నష్టం, నేనే చచ్చిపోతున్నాను. మళ్ళీ నిన్ను రక్షించమని అడిగినా రక్షించవు నువ్వు. రక్షించమని అడగటం కూడా తప్పు అని నీటిలో కొట్టుకుపోతూ తేలు ఈ మాటలు చెప్పింది.

మీకు మిగతా గొడవలు ఏమీ అక్కరలేదు, తేలు చెప్పిన ఈ మాటలు ఒక్కటే మీరు గుర్తు పెట్టుకోండి, ఈ తేలే గురువు. దీనిని బట్టి మనం అర్థం చేసుకోవలసింది ఏమిటంటే మాటల కంటే అలవాట్లు ఎక్కువ వేగంగా పని చేస్తాయి. వాళ్లకి చాలా ఉపకారం చేసామండీ, తిరిగి మాకు అపకారం చేసేసారు అని చాలామంది అంటారు. మనకి అపకారం చెయ్యాలని చేయరు. అలవాటుని బట్టి అలా వాళ్ళు చేసేస్తారు. ఎదుటి వాళ్లకి అపకారం చేసే మనిషికి మీరు వంద ఉపకారాలు చేసినా మీకు అపకారం చేయటం మానడు వాడు. ఎందుచేతంటే అది వాడి అలవాటు. వాళ్లకి మేము చేస్తే ఉపకారాలు చేసాము కాని అపకారం ఏమీ చెయ్యలేదు కదా, కానీ వాళ్ళు మాకు అన్యాయం చేసేసారు అనుకుంటారు మీరు. అలా మీరు ఆశ్చర్యపోకండి. మీరు ఉపకారం చేసినంత మాత్రం చేత వాడి స్వభావం ఎక్కడ పోతుంది. మీరు ఉపకారం చేసారని వాడికి తెలుస్తూ ఉంటుంది. కాని వాడికి అపకారం చేసే స్వభావం మారదు. ఆ అలవాటులో జన్మించాడు, ఆ అలవాటులో ఉంటాడు, ఆ అలవాటులో చచ్చిపోతాడు. కృష్ణుడు గీతలో ఏం చెప్పాడంటే ఈ పుస్తకాలు చదివినంత తేలిక కాదు స్వబావం మార్చుకోవటం అని. ఎక్కడో నలుగురు కూర్చుని చదువుకోవటం వల్ల, లేకపోతే ఇంటి దగ్గర కూర్చొని అధ్యయనం చేయటం వల్ల స్వభావం మారదు. స్వభావం మారాలంటే, మీమీద మీరు పోరాటం చెయ్యాలి. మీ మీద మీరు పోరాడితే, మీ మీద మీరు యుద్ధం ప్రకటించుకుంటే, అప్పుడు స్వభావం మారుతుంది. ఊరికే మనం మంచిగా ఉండాలి, మనం మంచిగా ఉండాలి అనుకుంటే మీ స్వభావం మారిపోదు. ఎవరికైనా ఉపకారం చేయాలి కాని అపకారం చేయకూడదు అని నువ్వు అనుకున్నా, అపకారం చేసే స్వభావం నీకు ఉన్నప్పుడు నువ్వు అపకారం చేయకుండా ఉండలేవు.

ఈ కథ మీరు ఎంతకాలం బ్రతికుంటే అంతకాలం జ్ఞాపకం పెట్టుకోవాలి. లోకం అంటే రకరకాల మనుషులు ఉంటారు కదా, అప్పుడు ఆ మనుషులతోటి మీరు అప్సెట్ అవ్వరు.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 20 అక్టోబర్ 1995, జిన్నూరు

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

ఈ రోజు భగవాన్ శ్రీ రమణమహర్షి 116వ జయంతి. ఏ జ్ఞానికి అయినా, బ్రహ్మానుభవం పొందిన వాడికి అయినా, వాడికి శరీరం ఉన్నా ఒక్కటే, లేకపోయినా ఒక్కటే. శరీరం అంటే ఉపాధి. ఉపాధి వచ్చినప్పుడేమో పుట్టినరోజు అంటున్నాము. ఉపాధి పోయిన రోజునేమో శరీరం విడిచి పెట్టిన రోజు అంటున్నాము. ఆత్మకి పుట్టుక లేదు, చావు లేదు. శరీరం పుడుతుంది, శరీరం పెరుగుతుంది, శరీరం ముసలిది అవుతుంది, శరీరం మరణిస్తుంది, అన్నీ శరీరానికే. శరీరానికి రోగం రావటం, శరీరం మరణించటం పొరపాటు ఏమీ కాదు. శరీరం అన్నాక రోగం వస్తుంది, అది ఏదో ఒక రోజున మరణిస్తుంది. అది పొరపాటు కాదు. ఇంక పొరపాటు అలా ఎక్కడ ఉంది అంటే మన హృదయంలో ఉన్న ఈశ్వరుడు మీద మనకి విశ్వాసం లేకపోవటం పొరపాటు. ఆయన అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్నాను అని చెబుతున్నప్పటికీ, ఆయన మాట మీద కానీ, ఆయన ఉనికి మీద కానీ, మనకి విశ్వాసం లేకపోవటం పొరపాటు.

మనకి అహంకారం మీద నమ్మకం ఉంది. మన తెలివితేటల మీద, రాగ ద్వేషాల మీద, అన్నిటిమీద నమ్మకం ఉంది. కానీ సర్వకాల సర్వ అవస్థల్లో, సజీవంగా ఏ వస్తువు అయితే ఉందో, ఆ వస్తువు మీద నమ్మకం లేదు, అదే మనలో ఉన్న పెద్ద పొరపాటు, అదే దోషం. ఆ వస్తువు మీద విశ్వాసం కుదరకపోతే అది ఎరుక పడదు. కొంతమంది మహాత్ములు ఏమని చెబుతారు అంటే, మన స్వరూపంలో ఉన్నటువంటి శాంతి, ఆనందం కనుక మనకు దొరికితే, ప్రపంచంలో ఉన్న వస్తుజాలం అంతా కూడా మనకు చీమలుగా కనిపిస్తాయి. ఆత్మశాంతి, ఆత్మసుఖం పొందినవాడికి ప్రపంచంలో ఉన్న objects అన్నీ కూడా చీమలు లాగ కనిపిస్తాయి. ఎక్కడైనా చీమని చూస్తే మనకి ఆకర్షణ కలగదు. అలాగే ప్రపంచంలో ఉన్న వస్తువు మీద కూడా బ్రహ్మానుభవం పొందిన వాడికి ఆకర్షణ కలగదు. అంటే కావాలి అని ఆపుకోవటం కాదు అది, సహజంగానే వాడికి ఆకర్షణ కలగదు. ఆ స్థితి, ఆ immortal state అటువంటిది.

మన ఇంద్రియాలకి, విషయాలకి అనుబంధం ఉంటుంది. ఒక్కొక్క ఇంద్రియాన్ని ఒక్కొక్క విషయం ఆకర్షిస్తూ ఉంటుంది. ఆ విషయాలను మనం అనుభవించటం వలన mind pollute అవుతుంది. అంటే గోడ మసిబారిపోతే ఎలా ఉంటుందో, Mind అలా Pollute అయిపోతుంది. అందుచేత మనస్సు భగవంతుడిని నమ్మడం లేదు. తనకి అత్యంత సమీపంలో ఉన్నప్పటికీ, తన మూలంలో ఉన్నప్పటికీ, భగవంతుడిని నమ్మడానికి అది సిద్ధంగా లేదు. ఎందుచేత? అందులో ఉన్న దోషాల వల్ల, అందులో pollute అయిపోవటం వల్ల, అది మసిబారిపోవటం వల్ల మనస్సు నమ్మడం లేదు. మనోమూలం మన హృదయంలోనే ఉంది. తల్లి కడుపు లోంచి బయటకి వచ్చిన మొదలు ఈ శరీరాన్ని స్మశానానికి తీసుకు వెళ్ళే వరకు మనకు రూపదృష్టి, నామదృష్టి తప్పించి ఇంకొక దృష్టి లేదు. ఇక్కడ విషయం ఎందుకు మనకి అర్థం కావటం లేదు అంటే, మనస్సుకి మూలం అయినటువంటి హృదయానికి రూపం లేదు, నామం లేదు. ఒక ఆకారం లేదు. మనం ఏమో శరీరం చనిపోయే వరకు ఏదో ఒక ఆకారం పట్టుకుని తిరుగుతున్నాము. మనో మూలానికి ఆకారం లేదు. ఈ రూపాలకి, నామాలకి, ఆకారాలకి అలవాటు పడిపోయిన మనస్సు అంతర్ముఖం అవ్వటం లేదు, హృదయంలోనికి చేరుకోవటం లేదు, హృదయంలో ఉన్న వస్తువుని పొందడం లేదు. దేవుడు అంటే ఎవడో మనకి తెలియటం లేదు కాబట్టి లేడు అనుకుంటున్నాము. ఎందుచేత? ఈ రూపదృష్టి, ఈ నామదృష్టి మనకి ఎక్కువగా ఉండడం వల్ల, అందులో బాగా పాతుకు పోవటం వల్ల, మనస్సు బాహ్యానికి వచ్చేస్తుంది కానీ అంతర్ముఖం అవ్వటం లేదు.

భారతదేశంలో చాలా పుణ్య క్షేత్రాలు ఉండగా ఈ అరుణాచలాన్నే భగవాన్ ఎందుకు ఎన్నుకున్నారు అని గణపతి శాస్త్రి గారిని అడిగారు. అరుణాచలాన్ని ఆయన ఎన్నుకోలేదు, అరుణాచలేశ్వరుడే ఈయనను ఎన్నుకున్నాడు. అరుణాచలేశ్వరుడే ఈయన స్మృతిలోకి వచ్చి, ఆయన ఎవరో తెలియ పరచి, ఒక కేక వేసి, ఒక పిలుపు పిలిచి ఈయనను ఆకర్షించుకున్నారు. అంతేకానీ ఈయనేమి ఈ ప్లేస్ సెలెక్ట్ చేసుకోలేదు. రమణమహర్షి గారు అరుణాచలం గురించి ఒక చక్కని మాట చెప్పారు. ఇది నా గుండెకి గట్టిగా పట్టుకుంది. గుండెలో ఉన్న విషయం ఎంత దాచుకుందాం అన్నా గొంతుకులోకి వస్తోంది. ఇది చాలా చక్కటి విషయం. ఆయన ఏమని చెప్పారు అంటే గురువులు, సాధనలు,

దేవతలు కూడా మీకు చెయ్యలేని సహాయం అరుణాచలం చేస్తుంది అని చెప్పారు. దానికోసం మీరు పెద్ద కష్టపడిపోనక్కర్లేదు, ఒళ్లంతా నలిపేసుకోనక్కర్లేదు, కుదిపేసుకోనక్కర్లేదు. అరుణాచలేశ్వరుడు మీ హృదయంలోనే ఉన్నాడు. కానీ ఆ లోతులలోకి మీరు దిగలేరు. అరుణాచలేశ్వరుడిని ప్రేమతో స్మరించుకోవటం వల్ల, విశ్వాసంతో అరుణాచలేశ్వరుడి యొక్క నామాన్ని మీరు స్మరించుకోవటం వల్ల, ఆయనే మిమ్మల్ని గుంజుకుంటూ, గుంజుకుంటూ ఆయన ఉన్న చోటుకి తీసుకుని పోతాడు. ప్రీతితో ఆయనను హృదయంలో మీరు స్మరించుకోవటం వల్ల గురువులు, దేవతలు, సాధనలు చెయ్యలేని సహాయం అరుణాచలేశ్వరుడి ద్వారా మీరు పొందవచ్చు అని చెప్పారు. అరుణాచలేశ్వరుడి గురించి ఆయన చెప్పిన మాట మీకు చెప్పకుండా ఉండలేక చెబుతున్నాను.

మనకి అహంకారం తగ్గుతూ ఉంటే అజ్ఞానం తగ్గుతుంది, స్వార్థం తగ్గుతుంది, ఆడంబరం తగ్గుతుంది, అశాంతి తగ్గుతుంది, అలజడి తగ్గుతుంది. మనం ఏదో పేరు సంపాదించాలి, గొప్పవాళ్లం అవ్వాలి అనేటటువంటి ఈ భ్రాంతులు తగ్గుతాయి. అంటే రూపదృష్టి, నామదృష్టి, ప్రాపంచికదృష్టి తగ్గుతుంది, ఆత్మదృష్టి పెరుగుతుంది. మేము నామం చేస్తున్నాము మాకేమి శాంతి కలగడం లేదు, అశాంతి వస్తోంది, అలజడి వస్తోంది అని కొంతమంది అంటారు. మనకి ఏ కారణం వల్ల మనస్సులో అశాంతి వచ్చినా, అలజడి వచ్చినా, ఆందోళన వచ్చినా, ఈజన్మలో కానీ, పూర్వజన్మలో కానీ భగవంతుడు చెయ్యవద్దు అని చెప్పిన పనులు మనం చేసినట్టు లెక్క. కర్మ మనలను వెంటాడుతూ ఉంటుంది, అనుభవిస్తే అది నశిస్తుంది కానీ ఒకవేళ ఈ శరీరం మరణించినా ఇంకొక జన్మకైనా అది అలా వెంటాడుతూ కూడా వస్తుంది. Dedication to God means denial of ego. భగవంతుడు కావాలి అని మీరు అనుకుంటే అహంభావాన్ని వదులుకోవాలి. పిల్లోడు మటుకు దుడ్డులా ఉండాలి కానీ కంచంలో అన్నం మటుకు కదలకూడదు అంటే ఎలా సాధ్యం అవుతుంది? మీకు దేవుడు కావాలి అంటే అహంభావన వదులుకోవాలి. అహంభావన కావాలి అంటే దేవుడిని వదులుకోవాలి. రెండింటిలో ఏదో ఒక్కటే నీకు అవకాశం ఉంది. నీకు అహంభావనే కావాలి అంటావా దేవుడు దొరికేది లేదు. ఈజన్మలోనే కాదు, కోటిజన్మలు ఎత్తినా దొరకడు. దేవుడే కావాలి అనుకుంటే దానిని వదులుకో. సైతాను కావాలి అనుకుంటే శివుడిని వదులుకో, శివుడు కావాలి అనుకుంటే సైతానుని వదులుకో!

ఇప్పుడు మనం సంసార సముద్రంలో ఉన్నాము. సంసారం అంటే ఇంట్లో మనుషులు కాదు. ఈ శరీరం చనిపోవటం, మళ్ళీ పుట్టటం, ఈ జనన మరణ ప్రవాహం ఉంది చూశారా అది సంసార సముద్రం. ఈ సంసార సముద్రం లోంచి ఒడ్డుకి రాలేకపోతున్నాము. ఎంతకాలం చూసినా అక్కడే తిరుగుతున్నాము. మధ్యలో ఏ పాడు స్నేహాలో దొరికితే అవి సుడిగుండం లాగా ముంచేస్తూ ఉంటాయి. ఆ సుడిగుండం లోంచి బయటకి రావటం మరీ కష్టం. అసలే సంసార సముద్రంలో ఉన్నాము. మనకి ప్రారబ్ధం సరిగా లేకపోతే పాడు స్నేహాలు దొరుకుతాయి. ఇప్పుడు మీరు శ్రద్ధగా వింటున్నారు. ఆ గోడ దాటాక దేవుడు లేడు, దెయ్యం లేదు అని ఎవడో అంటాడు అనుకోండి నిజం కాబోలు అని మీరు నమ్ముతారు. కొంతమందికి సొంత ఆలోచన ఉండదు. అసలే ఈ సంసార సముద్రం లోంచి ఒడ్డుకి రాలేక మనం తిప్పలు పడుతుంటే, మళ్ళీ ఈ లౌకిక స్నేహాలు ఒకటి, అవి సుడిగుండం లాగ లాగేస్తాయి. ఇన్ని ప్రమాదాల్లో పడి ఉండగా మనల్ని అందులోంచి ఒడ్డుకి లాక్కుని రావటం కోసం, అంటే సంసార సముద్రం లోంచి ఆత్మ జ్ఞానానికి, మోక్షం, శాంతి అనే ఒడ్డుకి తీసుకురావటం కోసమే రమణమహర్షి లాంటి మహా గురువులు, మహా జ్ఞానులు ఉపాధి కల్పించుకుంటారు. అదే రమణమహర్షి యొక్క జననం.

మహాత్ములకు, జ్ఞానులకు ఉపాధి యొక్క పుట్టుక, ఉపాధి యొక్క చావుతో వాళ్లకి ఏమీ సంబంధం లేదు. అయితే మనం ఉపాధి తోటి తాదాత్మ్యం పొంది ఉంటున్నాము కాబట్టి వాళ్ళు కూడా మనలాగే పుట్టారు అని, మనలాగే చనిపోయారు అని మనం అనుకుంటాము. వాళ్లని కారణ జన్ములు అంటారు. అంటే మనం కర్మ అనుభవించడానికి జన్మించాము కాని వాళ్లకి అనుభవించవలసిన కర్మ ఏమీ లేదు. తొలగించుకోవలసిన పాపం కానీ, తొలగించుకోవలసిన దోషం కానీ, తొలగించుకోవలసిన ఒక్క బలహీనత కానీ అక్కడ లేదు



**మనకి సత్వగుణం ఉన్నప్పుడు సబ్జెక్టు అర్థం అవుతుంది. కాని, రజోగుణం, తమోగుణం ఉన్నప్పుడు సబ్జెక్టు విన్నా మనకి అర్థం అవ్వదు. అందుచేత సత్వగుణం లేకపోతే, దానిని మనం కల్టివేట్ చేసుకోవాలి. సత్వగుణం మాత్రమే ఆత్మజ్ఞానానికి దారి చూపిస్తుంది.**

కాబట్టి వాడు కర్మ అనుభవించడానికి రాలేదు, వాడు కారణజన్ముడు. మన హృదయంలో తొలగించుకోవలసిన దోషం ఒక్కటి ఉన్నప్పటికీ, తొలగించుకోవలసిన బలహీనత ఒక్కటి ఉన్నప్పటికీ వాడు కారణజన్ముడు కాదు. సంసార సముద్రం నుంచి జ్ఞానం అనే ఒడ్డుకి, మోక్షం అనే ఒడ్డుకి safeగా తీసుకురావటం కోసం గురువు అవసరం. ఆ గురువు యొక్క పని చెయ్యటం కోసం ఈశ్వరుడే కొంతమంది మహా గురువులని, ఆయన తోటి సమానమైన వాళ్ళని ఈ లోకంలోకి పంపిస్తాడు. వాళ్ళు కారణ జన్ములు. వాళ్ళు చెప్పిన మాట త్రిలోకాల్లో కూడా సత్యం మీదే base అయ్యి ఉంటుంది, సత్యాన్నే పట్టుకుని ఉంటుంది. వాడు చెప్పిన మాట కూడా భగవంతుడు తోటి సమానం. జ్ఞాని నోటి వెంట వచ్చిన మాట కూడా భగవంతుడు తోటి సమానం. చెరువులు తవ్వించాం, కాలువలు తవ్వించాం అంటే తవ్విస్తే తవ్వించవచ్చు. First God and then world అన్నాడు రామకృష్ణుడు. మనం కాలువలు తవ్విస్తే తవ్వించుకోవచ్చు మంచిదే. కానీ మనం అందుకు పుట్టలేదు. మనకి దేహం ఉంది కాబట్టి, ఆ దేహయాత్ర కోసం మనం కొంత పని చెయ్యాలి. కానీ మన గమ్యం జ్ఞానం. First God and then world. మొట్టమొదట దేవుడు, తరువాత ప్రపంచం. మనం కాలువలు తవ్వించవచ్చు, కానీ అదే మటుకు జీవిత ధ్యేయం కాదు. జీవిత ధ్యేయం జ్ఞానం.

భగవాన్ పుట్టిన గ్రామం తిరుచ్చుళి. తరువాత హైస్కూల్ చదువుకి మధుర వచ్చాడు. మధురలో హైస్కూల్‌లో చదువుకుంటూ ఉండగా వారి పినతండ్రి గారి ఇంటి దగ్గర మరణానుభవం కలిగింది. మరణానుభవం ద్వారా మహాజ్ఞాని అయ్యాడు. ఎందుకు మరణానుభవం కలిగింది అంటే ఎవ్వరూ చెప్పలేరు, అది దేవ రహస్యం. పరమేశ్వరుడు మన హృదయంలో ఉండి ఏమి చేస్తాడు అంటే, ఆ దేహప్రారబ్ధాన్ని బట్టి ఆడిస్తూ ఉంటాడు. దాని పని ఏదో అది చూసుకుంటూ వెళ్ళిపోతుంది. మనం నీరు బయట పోసాం అనుకోండి పల్లానికి వెళ్ళమని నీటికి చెప్పక్కర్లేదు, పల్లం చూసుకుని అదే వెళ్ళిపోతూ ఉంటుంది. అదే విధంగా దేహం ఏ ప్రారబ్ధం అనుభవించడానికి ఈ లోకంలోకి వచ్చిందో, ఆ ప్రకారం ఈ దేహం వెళ్ళిపోతూ ఉంటుంది. ఆయన వచ్చిన పని ఏమిటి? గురుస్థానం వహించడానికి వచ్చారు. గురువు ఎలా అయ్యాడు? మరణానుభవం ద్వారా గురువు అయ్యాడు. దేహం మరణించిన తరువాత కూడా ఆయన హృదయంలో మరణం లేని వస్తువు ఒకటి ఉందని ఆయనకి అనిపిస్తుంది. దేహం మరణించినప్పటికీ మనం ఉన్నాము ఏమిటి? దేహం మరణిస్తే మనం కూడా మరణించాలి కదా, నాకు చావు రావటం లేదేమిటి, దేహం

మరణించింది, దీనిని బూడిద చేసేస్తారు అయినప్పటికీ నాకు చావు రావటం లేదేమిటి అనేటటువంటిది అది ఊహాగానం కాదు, అది ఆయనకు డైరెక్టుగా అనుభవం అయ్యింది. మన అందరికీ మరణం అంటే భయం. మరణానుభవం ద్వారా ఆయనకి మరణ భయం పోయింది. అంటే మరణం లేని వస్తువుని పొందాడు కాబట్టి మరణ భయం పోయింది. ఇది ఇక్కడ గ్రహించవలసినది. ఏదో వేదాలు చదువుకుని, అవి చదువుకుని, ఇవి చదువుకుని, చెప్పే మాటలు కాదు. మరణానుభవం ద్వారా ఆయనకు మరణ భయం పోయింది. అప్పుడు గురువు అయిపోయాడు ఆయన. అప్పుడు అరుణాచలేశ్వరుడు ఏమి చేశాడు అంటే ఈయనను మధురలో ఉంచకుండా, ఆయన ఒడిలోకి తీసుకోవటం కోసం, వాళ్ళ అన్నగారి చేత ఏవో కొన్ని మాటలు అనిపించాడు. ఆ మాటలు అనకపోతే, ఆ మొట్టికాయ తగలకపోతే వాడు ఇంక మధురలోనే కూర్చుంటాడు. వాళ్ళ అన్నగారు మంచివాడే, ఒక్కొక్కసారి మంచి వాళ్ళు కూడా పొరపాటు మాటలు మాట్లాడుతూ ఉంటారు. వీళ్ళు కూడా ఇలా మాట్లాడుతున్నారు అని అనిపిస్తూ ఉంటుంది. లోపల ఈశ్వరుడు ఉన్నాడు కదా. వాడి చేత ఏదో అనిపిస్తూ ఉంటాడు వీడి దగ్గర ఎంత సరుకు ఉందో తెల్చుకోవటం కోసం.

మరణానుభవం తరువాత ఈయన ఏదో చదువుకుంటున్నాడు కానీ సమాధి స్థితి వరించి, వరించి వచ్చి ఈయన మీద పడుతోంది. సమాధి స్థితి కోసం ఈయన ప్రయత్నం చెయ్యటం లేదు. శారీరక తపస్సు, మానసిక తపస్సు, వాచక తపస్సు, ఎన్ని చేసినా ఆ స్థితి మనకు రాదు దైవానుగ్రహం లేకపోతే, అయినప్పటికీ సమాధి స్థితి వరించి వరించి ఆయన మీద పడుతుంటే పుస్తకం ఆయన చేతి లోంచి జారిపోతుంది. అప్పుడు అన్నగారు "నువ్వు యోగివిలా కనిపిస్తున్నావు, నీబోటి వాడికి ఇంటి దగ్గర పనేముంది ఎక్కడికైనా పోరాదా" అన్నాడు. నిజమే ఆయన చెప్పేది, ఎక్కడికైనా పోరాదా అంటున్నాడు, అది కరెక్టే మనకి ఇంటి దగ్గర పనేముంది అనుకున్నాడు. అరుణాచలేశ్వరుడు అన్నగారి చేత ఆ మాటలు అనిపించాడు. ఈయనకి హృదయంలో జ్ఞాపకానికి వచ్చాడు. ఎక్కడకి పోదాం అని ఈయన అనుకున్నాడు. అరుణాచలం, అరుణాచలం అని లోపల ఆయన హృదయంలో స్ఫురించింది. అక్కడ ఉన్నవాడు ఈశ్వరుడే, ఇక్కడ ఉన్నవాడు ఈశ్వరుడే, మాటలు అనిపించినవాడు ఈశ్వరుడే, అరుణాచలం వెళ్ళాలి అనే స్ఫురణ కలుగజేసినవాడు కూడా ఈశ్వరుడే, అంతా ఈశ్వరుడే.

అంతా ఈశ్వర సంకల్పం తోటి నడుస్తోంది. కానీ మనకి తెలియడం లేదు. అది తెలుసుకోవటమే కావాలి అన్నారు. ఈ మాట ఎంత ముద్దుగా ఉందో చూడండి. మనకి తెలిసున్నా, తెలియక పోయినా ఈశ్వర సంకల్పమే జరుగుతుంది. ఈశ్వర సంకల్పం తోటి అంతా నడుస్తోంది అన్న విషయం తెలుసుకోవటం కావాలి. అది తెలుసుకుంటే దుఃఖం నశిస్తుంది. ఆయనకి మరణానుభవం కలిగిన తరువాత, సెప్టెంబరు 1వ తేది, 1896వ సంవత్సరం అరుణాచలం వచ్చారు. నేను అరుణాచలం వచ్చిన తరువాత కొత్తగా పొందినది ఏమీ లేదు. ఏదైతే మధురలో పొందానో అదే చివరి వరకు ఉంది. అంతేకానీ నేను కొత్తగా పొందినది ఏదీ లేదు. అది అద్భుతం, అపూర్వం, ఉదాత్తం. Excellent, wonderful, beautiful ఏమిటంటే తాను పొందిన అనుభవం, అలాగే ఉండాలి జారిపోకూడదు అని కూడా ఆయన ఎప్పుడూ అనుకోలేదు, అది జారిపోలేదు, అలాగే ఉంది. ఎప్పుడైనా మంచి వార్త విన్నప్పుడు మనకి కూడా శాంతి కలుగుతూ ఉంటుంది. మళ్ళీ ఆ మరుసటి రోజుకి ఏమీ ఉండదు. ఒకోరోజున అనిపిస్తూ ఉంటుంది చాలా శాంతిగా ఉన్నాము అని, 24 గంటలు తిరగకుండా ఆ శాంతి జారిపోతుంది, ఆ సుఖం జారిపోతుంది. కానీ మరణానుభవంలో ఏదైతే పొందారో, ఈ అనుభవం ఎప్పుడూ ఇలాగే ఉండిపోవాలి. ఇది ఎప్పుడూ జారిపోకూడదు అని ఆయన అనుకోలేదు. అనుకోకపోయినా అది జారలేదు, అలాగే ఉండిపోయింది. వాడు ఋషి.

దైవమనుచు నిను దరిజేరగా, దేవుడు దేవుడు అని అందరూ చెప్పుకుంటూ ఉంటే నేను నీ దగ్గరకు వచ్చాను. తీరా వచ్చి నిన్ను చూస్తే నన్ను పూర్ణ నాశనమొనర్చితివి అరుణాచలా అన్నారు భగవాన్. ఆయన సంస్కారాలు అన్నీ అరుణాచలేశ్వరుడు ముండనం చేసేశాడు. ఇంక తొలగించుకోవడానికి అక్కడ బలహీనత లేదు, దోషం లేదు. సాధన చేసి, ప్రయత్నం చేసి తొలగించుకునే బలహీనత అక్కడ కనపడటం లేదు. ఎందుచేత? మొత్తం అంతా ముండనం అయిపోయింది. లోకంలో ఆకర్షించే విషయం ఏది కూడా ఆయనకి లేదు. ఎందుచేత? కంప్లీట్ గా అక్కడ షేవింగ్ అయ్యిపోయింది. దేనికి? తలకాయకి కాదు మైండ్ కి. రమణమహర్షిలో ఉన్న అహంభావాన్ని శేషం లేకుండా నిశ్శేషంగా నాశనం చేశాడు, వాడు అరుణాచలేశ్వరుడు. నాకు బయట లోకం ఉంది అన్న బుద్ధి కూడా నశించింది. మనం వాళ్ళు ఏమనుకుంటారు, వీళ్ళు ఏమనుకుంటారు అనుకుంటాము

కదా, అలా అనుకునేది ఎవరు? అహంభావనే. అది నశించింది. అది ఎప్పుడైతే నశించిందో నాకు బయట లోకం ఉందనేదృష్టి కూడా వాడికి ఉండదు. అరుణాచలం, అరుణాచలం అని ఎవడైతే చింతన చేస్తున్నాడో వాడి పట్ల అరుణాచలేశ్వరుడి కృప పడుతుంది. అది చంపకుండా చంపే మందు. అది నీ దేహాన్ని చంపదు, నీ దేహబుద్ధిని చంపుతుంది. చంపకుండా చంపే మందు. అది Final truthకి తీసుకుపోతుంది. నీ ఇష్టాయిష్టాల తోటి సంబంధం లేకుండా నీకు ఆయన పట్ల ప్రేమ కుదిరితే, ఆప్యాయత కుదిరితే పరమ సత్యానికి నిన్ను మోసుకుపోతాడు.

రమణమహర్షి గారు అరుణాచలం వచ్చి 1996వ సంవత్సరం సెప్టెంబరు 1వ తేదీకి నూరు సంవత్సరాలు అయింది. 54 సంవత్సరాలు ఆయన దేహం అరుణాచల క్షేత్రంలో తిరుగాడింది. 54 సంవత్సరాలు ఈ దేహం అరుణాచలంలో ఉంటే, అరుణాచలం విడిచి పెట్టి ఇంకొక చోటకి వెళ్ళాలి అనేటటువంటి సంకల్పం కూడా రాలేదు అన్నారు. వచ్చిన తరువాత నిగ్రహించుకోవటం కాదు, నాకు ఆ సంకల్పమే రాలేదు అన్నారు రమణమహర్షి గారు. అంటే దానినిబట్టి అరుణాచలేశ్వరుడి మీద ఆయనకు ఉన్నటువంటి ఆ ప్రీతి, ఆ జన్మాంతర అనుబంధం తెలుస్తుంది. 1950వ సంవత్సరం ఏప్రిల్ నెల 14వ తేదీన శరీరం అక్కడ విడిచి పెట్టారు. అయితే బ్రహ్మానుభవం పొందిన వాడు బ్రహ్మమే అవుతాడు. అక్కడ శరీరం ఉన్నా, లేకపోయినా వాళ్ళు పని చేస్తూనే ఉంటారు. పని చేసేది కానీ, ప్రేమించేది కానీ, ఆప్యాయంగా చూసేది కానీ ఆ శవం కాదు, బ్రహ్మమే.

మీ ద్వారా మేము unlimited love, unlimited peace, unlimited affection అంటే ఒక హద్దులు లేని ప్రేమని, హద్దులు లేని శాంతిని మీ ద్వారా మేము పొందాం. మరి మీరు లేకపోతే మమ్మల్ని ఎవరు ప్రేమిస్తారు అని భగవాన్ ని అడిగితే, మిమ్మల్ని ప్రేమించేది ఈ శరీరమా? మిమ్మల్ని ఆప్యాయంగా చూసేది ఈ శరీరమా? అని అడిగారు. మిమ్మల్ని నేను ప్రేమిస్తున్నాను అని మీరు అనుకుంటే ఈ శరీరమా మిమ్మల్ని ప్రేమిస్తుంట, ఈ శరీరమా మీకు శాంతిని కలుగజేసేది? ఏదైతే మిమ్మల్ని ప్రేమిస్తుందో, ఏ వస్తువు ద్వారా మీకు శాంతి కలుగుతుందో, అది ఈ శరీరం పడిపోయిన తరువాత కూడా ఉండనే ఉంటుంది అన్నారు. వాడు రమణమహర్షి. మిమ్మల్ని కరుణించే వస్తువుకి, మిమ్మల్ని అనుగ్రహించే వస్తువుకి చావు లేదు. శరీరం ఉన్నప్పుడు కూడా మిమ్మల్ని అనుగ్రహించేది ఈ శరీరం కాదు, మిమ్మల్ని ప్రేమించేది ఈ

శరీరం కాదు కాబట్టి శరీరం ఉన్నా, శరీరం లేకపోయినా బ్రహ్మానుభవం పొందిన వాడి ద్వారా మనకు శాంతి, జ్ఞానం అందుతూనే ఉంటుంది. సహాయం వస్తూనే ఉంటుంది. నమ్మిన వాళ్లకి సొమ్ము, నమ్మని వాళ్లకి దుమ్ము. ఎంత అద్భుతంగా ఉందో చూడండి.

అయితే ఈశ్వరుడు, గురువు మన హృదయంలోనే ఉన్నాడు. హృదయంలో ఉన్న ఆయన స్థానానికి మనల్ని తీసుకు వెళ్లడం కోసమే ఆయన శరీరం ధరించి వచ్చాడు. మనస్సు హృదయంలో ఉంటే దానిని అంతర్ముఖం అంటారు. హృదయాన్ని విడిచి పెట్టి బయటకు వచ్చేస్తే బాహ్యాముఖం అంటారు. హృదయంలో ఉన్నప్పుడు దానికి శాంతి కలుగుతుంది. ఏ విషయాలు అయితే నిన్ను బాహ్య ముఖానికి తీసుకుని వస్తున్నాయో, ఆ విషయాల నుంచి నిన్ను తప్పించి, ఆ విషయాల నుంచి నిన్ను విడుదల చేసి, లోపల హృదయ స్థానంలోకి నిన్ను తీసుకుని వెళ్లడం కోసం కైలాసం నుండి భూమి మీదకి దిగి వస్తాడు, వాడే గురువు. మన సొంత ప్రయత్నం వల్ల, మన సొంత తెలివితేటల వల్ల ఆ వాసనని మనం తొలగించలేము. పునర్జన్మకి హేతువులు అయిన అనేక వాసనలు మనలో ఉంటాయి. వాటి లోంచి విడుదల చెయ్యడానికి మనకి సహాయ పడేవాడే గురువు. అదే రమణమహర్షి గారు చెప్పారు. మీ మనస్సుని బాహ్యాముఖం చేసేవాడు గురువు కాదు రాక్షసుడు. మీ మనస్సు హృదయాభిముఖంగా ప్రయాణం చెయ్యడానికి సహాయం చేసేవాడు గురువు. రమణ స్వామి ఇప్పుడు లేడు అని ఎవరైనా అనుకుంటే ఆయన దేహమే అనుకోవటం వల్ల ఇప్పుడు లేడు అనుకుంటున్నాము. ఆయన ఎప్పుడూ ఉన్నాడు. దేహం అని అనుకోవటం వల్ల ఇప్పుడు లేడు అని మనకి అనిపిస్తుంది. మనం దేహం అనుకుంటున్నాము కాబట్టి ఆయన కూడా దేహమాత్రుడు అనే అనుకుంటున్నాము.

గురువు ఏదైతే చెప్పాడో ఆ ఉపదేశాన్ని అనుసరించు. ఆ ప్రవచనాన్ని అనుసరించి, ఆ ఉపదేశాన్ని అనుసరించి నువ్వు నడవడమే. ఎందుచేత అంటే గురువు, ఈశ్వరుడు

**మనిషి మానసిక ప్రవృత్తిని బట్టి ఒక్కో మార్గం ఒకొక్కళ్ళు ఇష్టపడతారు. అన్ని యోగాలు కూడా మనసులో ఉన్న కల్మషాన్ని తొలిగించుకోవటానికి చేసే ప్రయత్నమే.**



వేరు కాదు. గురువు అనుగ్రహం ఉంటే ఈశ్వరుడి అనుగ్రహం మనకి ఉన్నట్టే, ఈశ్వర అనుగ్రహం ఉంటే గురువు అనుగ్రహం కూడా మనకి ఉన్నట్టే, గురువు, ఈశ్వరుడు వేరు కాదు. ఆయన చెప్పినట్టు నడవడమే, నీ మనస్సుని లోపలకి మళ్ళించడమే, అంటే గురువు బోధ అంతా దేనిమీద ఆధారపడి ఉంటుంది అంటే, నీ మనస్సుని, నీ చేతని, నీకు ఎన్నైతే శక్తులు ఉన్నాయో, ఆ శక్తులన్నీ ఒకచోటకి తీసుకొచ్చి మొత్తం ఆ శక్తినంతా లోపలకి మళ్ళించడమే, నీ తెలివిని ఎక్కడకి మళ్ళించాలి? లోపలకి మళ్ళించడమే. అదే గురువు చేసే పని. బయట పరిస్థితులు నీ మనస్సుని లోపలకు తీసుకువెళ్ళేలా సృష్టిస్తాడు. ఇదొక గొడవ తెచ్చి పెడుతున్నాడు ఇక్కడ, మీ అమ్మాయి అంటే మీకు బాగా ఇష్టం అనుకోండి, మీ అమ్మాయి చేత ఏవో రెండు, మూడు తిట్లు తిట్టిస్తూ ఉంటాడు మిమ్మల్ని, ఇంత కష్టపడి పెంచాం ఇదే తిడుతుంది ఇంక దీని గొడవ మనకి ఎందుకు అని మీరు అనుకుంటారు. అప్పుడు కానీ మనస్సు లోపలకి వెళ్ళదు. మీ మనస్సు ఎవరి మీద అయితే ఎక్కువ వాలుతుందో వాళ్ళ చేతే రెండు మొట్టికాయలు మొట్టిస్తూ ఉంటాడు. వీళ్ళ గురించి ఇంత కష్టపడుతుంటే వీళ్ళే మొట్టికాయలు మొడుతున్నారు ఏమిటి? ఎందుకు వీళ్ళ వెంట తిరగాలి? అని మీకు అనిపిస్తూ ఉంటుంది.

బయట చేసే పని గురువే, లోపల చేసే పని గురువే, వాడు చేస్తున్నాడు అన్న సంగతి మనకి తెలియడం లేదు. ఎందుచేత? మన అహంకారం వల్ల మనకి తెలియడం లేదు. గురువు చేసే పని వైపుకి మన కళ్ళు తెరుచుకోలేదు. గురువు చేసే పనికి కళ్ళు తెరచుకుంటే అది మనకు తెలుస్తుంది. అదే భగవాన్ చెబుతూ ఉంటారు కొంతమంది కళ్ళు ఉండిచూడలేరు, చెవులు ఉండి వినలేరు. అంటే గురువు పని చేస్తున్నాడు. ఆ గురువు చేసే పనికి నీ కళ్ళు తెరవబడలేదు. అందుచేత నీకు కనపడటం లేదు. నీ హితులు నిన్ను విమర్శించినప్పుడు, నీ మిత్రులు నీకు మానసికంగా దూరం అవుతున్నప్పుడు నీకు ఆలోచన ప్రారంభం అవుతుంది. ఏమిటి ఇలా ఉందని మీకు ఆలోచన ఎప్పుడైతే ప్రారంభించిందో మీ మనస్సుకు బాహ్యముఖంగా వెళ్ళే వేగం తగ్గిపోయి ఒక్కసారి రవ్వంత, ముల్లంత మీ మనస్సు లోపలకు తొంగి చూస్తుంది. దేనివైపు? మీ హృదయం వైపు. మీకు లోపలకు వెళ్ళిపోదాం అని ఉద్దేశ్యం కాదు. బయట పరిస్థితులు ఇలా ఉన్నాయి ఏమిటి, మనం మంచి చేసినా చెడ్డ ఎదురు వస్తుంది ఏమిటి అని ఒకసారి లోపలకు చూడడం మొదలు పెడతారు. నువ్వు ఎప్పుడు లోపలకు చూస్తావు అని గురువు కనిపెట్టుకుని

ఉన్నాడు కదా, లోపలకు చూడడం మీరు ఎప్పుడైతే ప్రారంభించారో గుంజటం వాడు మొదలుపెడతాడు. ఆ గుంజటం, గుంజటం, వాడి స్వరూపాన్ని మీకు ఇచ్చేవరకు వదిలి పెట్టడు. వాడు గురువు. గురువు మాట అనుగ్రహం, చూపు అనుగ్రహం, చేత అనుగ్రహం, వాళ్ళ ఆగ్రహం కూడా అనుగ్రహమే. ఒక్క మాట చాలు, ఒక్క చూపు చాలు, అది అనుగ్రహమే.

నిన్ను ఒక్కొక్కసారి గుంజుతూ ఉంటాడు, మళ్ళీ విడిచి పెడుతూ ఉంటాడు. గుంజుతూ ఉంటాడు మళ్ళీ విడిచి పెడుతూ ఉంటాడు. మొత్తం మీద ఆపరేషన్ చేసే ముందు పేషెంట్ ని ఎలా ప్రిపేర్ చేస్తారో అలాగ కొంతకాలం నిన్ను బాగా ప్రిపేర్ చేస్తాడు. ఆ ప్రిపరేషన్ కి కొంత టైం పడుతుంది. ప్రిపరేషన్ తరువాత కొన్ని క్షణాల్లో ఆయన స్వరూపాన్ని మీకు ఇచ్చేస్తాడు. పెళ్లి హడావిడి నెల రోజులు పడుతుంది. ఆ పెళ్లి అయిపోతుంది. అలాగే బ్రహ్మానుభవం పొందటం కోసం నిన్ను ప్రిపేర్ చెయ్యడం కోసం చాలా టైం పడుతుంది కానీ అనుభవం నీకు ఇవ్వడానికి కొన్ని క్షణాల్లో ఇచ్చేస్తాడు. ఆ ప్రిపేర్ అయినప్పుడు కొంచెం కష్టంగా ఉంటుంది. అప్పుడు మీకు ఏమనిపిస్తుంది అంటే, ఏమిటి ఇంత sufferingకి గురి చేస్తున్నాడు ఈశ్వరుడు మనల్ని అనిపిస్తుంది కానీ బ్రహ్మానుభవం పొందిన వెంటనే వీడు పడ్డ బాధ కూడా మర్చిపోతాడు. ఇల్లు కట్టేటప్పుడు చాలా చిరాకుగా కష్టంగా ఉంటుంది, గృహ ప్రవేశం అయిపోయాక, ఇంట్లో కూర్చున్నాక ఆ కష్టం అంతా వాడు మర్చిపోతాడు. ఆ ఇల్లు కట్టడానికి పడ్డ కష్టం అంతా వాడు మర్చిపోతాడు. అలాగే ఈ బ్రహ్మానుభవం పొందడానికి మీరు చాలా కష్టపడినట్టు అనిపిస్తుంది. కానీ బ్రహ్మానుభవం పొందిన వెంటనే ఆ కష్టం అంతా మీరు మర్చిపోతారు, అంతా ఆనందమే, అంతా శాంతే.

బయట ఉన్న గురువు ఏమి చేస్తాడు అంటే ఎవరో ఒకరిచేత ఏవో మాటలు అనిపిస్తూ ఉంటాడు, బయట నుంచి లోపలకు తోస్తూ ఉంటాడు. నీ శరీరం ఎక్కడ ఉందో చూసి నువ్వు ఆత్మలో స్థిరపడేవరకు నిన్ను విడిచి పెట్టడు, వాడే గురువు. నువ్వు ఎవరిగా ఉన్నావో ఆ స్థితి నువ్వు పొందే వరకు, ఆత్మస్థితి పొందేవరకు నిన్ను విడిచి పెట్టడు. ఆత్మ వైభవం నీకు కలిగేవరకు నిన్ను విడిచి పెట్టడు. ఆత్మ శాంతి, ఆత్మ జ్ఞానం అందేవరకు నిన్ను విడిచి పెట్టడు. నిన్ను వెంటాడుతూనే ఉంటాడు, వాడే గురువు. బయట నుండి లోపలకు తోస్తాడు, లోపల నుండి లోపలకు గుంజుతాడు, వాడు గురువు. గురువు అంటే ఏదో కాలక్షేపం మాటలు అనుకోకండి, సత్యాన్ని వాడి చేతితో పట్టుకుని సత్యాన్ని మన

చేతికి అందివ్వడం కోసం పడే తపన. సత్యాన్ని ఎక్కడో పెట్టుకుని కాదు, వైకుంఠంలోనో, కైలాసంలోనో పెట్టుకుని కాదు, వాడి చేతితో పట్టుకుని, ఆ సత్యాన్ని మన చేతికి అందివ్వడం కోసం జరుగుతున్న struggle.

పూజ, జపం, ధ్యానం, విచారణ ఇదంతా మైండ్‌ని ప్రిపేర్ చెయ్యటం కోసం, లోపల హృదయంలో తిష్ట వేసుకుని కూర్చొన్న ఈశ్వరుడి చేతికి మనస్సుని అందివ్వడం కోసం చేసే ప్రక్రియే సాధన. మళ్ళీ రిపీట్ చేస్తున్నాను చెప్పకుండా ఉండలేక చెపుతున్నాను. నీ నామాన్ని ప్రేమతో, విశ్వాసంతో స్మరిస్తే, గురువులు చెయ్యలేని పని, సాధనలు చెయ్యలేని పని, దేవతలు చెయ్యలేని పని నువ్వు చేస్తావు అయ్యా అరుణాచలేశ్వరుడా అంటున్నారు. భగవాన్‌కు ఆయనతో మానసిక అనుబంధం, అరుణాచలేశ్వరుడు తోటి ఆయన పొందిన అనుభవంలోంచి తీసి చెప్పే మాటలు కానీ, అవి speculation కాదు, imagination కాదు. మనం ఏదైనా పని మొదలు పెట్టి ఆ పని పూర్తి చేసేశాం అనుకోండి మా తెలివి తేటల వల్ల, మా సమర్థత వల్ల, ఈ పని పూర్తి చేసేశాము అని చెబుతాము. ఆ మనిషే ఒక పని చెయ్యలేదు అనుకోండి. దేవుడి దయ లేదు అంటాడు. మన వరస ఇలా ఉంది అంటున్నారు. ఆ పని అయితే వాడు కష్టపడి చేసినట్టు. పని అవ్వకపోతే దైవం అనుకూలించలేదు అంటాడు. మనిషి తెలివితేటలు ఇలా సిద్ధం అయ్యాయి.

Nothing is too heavy for destiny. మీ పదవులు కానీ, మీ అధికారాలు కానీ, మీ సంపదలు కానీ, మీ గొప్పలు కానీ కాల ప్రవాహం వచ్చినప్పుడు అన్నీ కొట్టుకుని పోతాయి. మీకు ఏదైనా అధికారం వస్తే అది ఈశ్వర సంకల్పమే, పోయినా ఈశ్వర సంకల్పమే కానీ నువ్వు ఏమి అనుకుంటున్నావు అంటే అధికారం వచ్చినప్పుడు నా తెలివి తేటలు అనుకుంటున్నావు. పోయినప్పుడు దేవుడు నాకు సహకరించలేదు అనుకుంటున్నావు. జరిగేది అంతా ఈశ్వర సంకల్పమే, ఇది తెలుసుకోవడమే కావాలి. పని అయినప్పుడు దేవుడు సహాయం వల్ల అయ్యింది అని నువ్వు అనుకోవటం లేదు. పని అవ్వనప్పుడు దేవుడు నాకు సహకరించలేదు అని నువ్వు అనుకుంటున్నావు. అంటే నీ తెలివితేటలు, నీ బుద్ధి ఇలా ఉంది అన్నమాట. అంటే మనలో ఉన్న అల్పత్వాన్ని ఎత్తి చూపిస్తున్నారు. పని జరిగితే నీ తెలివితేటలు అనుకుంటున్నావు, కాని పని జరిగినప్పుడు కూడా ఈశ్వర సంకల్పం అని మటుకు నువ్వు అనుకోవటం లేదు. అంటే అంత వినయం నీకు లేదు, అంత ఆలోచన

నీకు లేదు. అంటే నువ్వు బుద్ధిమంతుడవు కాదు అన్నమాట. నువ్వు ఏదైనా మాట్లాడితే నీ మాట బ్రహ్మానుభవం పొందటానికి సహకరించాలి. నువ్వు ఒక పని చేస్తే బ్రహ్మానుభవం పొందడం కోసం నీ పని సహకరించాలి. నీ మనస్సులోకి ఏదైనా ఒక ఆలోచన వస్తే, ఏదైనా ఒక తలంపు వస్తే, ఆ ఆలోచన, ఆ తలంపు నీకు బ్రహ్మానుభవానికి సహకరించాలి. అలా ఎవడైతే మాట్లాడుతున్నాడో, అలా ఎవడైతే చేస్తున్నాడో, అలా ఎవడైతే జీవిస్తున్నాడో, వాడు బుద్ధిమంతుడు అన్నాడు భగవంతుడు వాసుదేవస్వామి. మనం బుద్ధిమంతులం అవునా, కాదా అని ఆయన చెప్పటం లేదు. బుద్ధిమంతులు అంటే ఒక ప్రమాణం ఆయన చెప్పాడు. దానిని బట్టి మనం బుద్ధిమంతులం అవునో, కాదో మనం చూసుకోవాలి. నీవు మాట్లాడే మాటే నీకు బ్రహ్మానుభవం కలగడం కోసం సహకరించకపోతే అటువంటి మాటలు మాట్లాడడం అనవసరం. నువ్వు చేసే పని, నీకు వచ్చే ఆలోచన, నువ్వు మాట్లాడే మాట బ్రహ్మానుభవం పొందటానికి ఎంతవరకు నీకు సహకరిస్తున్నాయి అని నువ్వు చూసుకో. ఆ మాటల వల్ల, ఆ పనుల వల్ల, ఆ చేతల వల్ల నీకు బ్రహ్మానుభవం కలగాలి.

అహంకారం పెద్ద మదించిపోయిన ఏనుగు లాంటిది. ఏనుగు ఒక్క సింహానికే అణుగుతుంది. ఇంక దేనికి అణగదు. సింహం బయటకి వచ్చినప్పుడు దానిని చూసి ఏనుగులు, నక్కలు, జింకలు, ఇవన్నీ చెట్టుకింద దాక్కుని ఉండిపోతాయి. సింహం అలా వెళుతోంది అంటే వెళ్ళి చూసి వస్తాను అని ఎవడైనా అంటాడా? అనడు. అలాగే ఎవడికైతే బ్రహ్మానుభవం కలిగిందో వాడిని ఈ విషయాలు, ఈ ఇంద్రియాలు, ఈ బాహ్య గొడవలు, ఇష్టాయిష్టాలు చూసి వస్తాను అనవు. గుహ లోంచి సింహం బయటకి వచ్చినప్పుడు అడవి జంతువులు అన్నీ ఎలా కామ్ అయ్యిపోతాయో, అలాగే హృదయంలో ఉన్న చైతన్యం, ఈశ్వరుడు ఒక్కసారి మనకి అనుభవంలోకి వచ్చేటప్పటికి మన ఇంద్రియాలు, ఇంద్రియాలకి సంబంధించిన విషయాలు, మనస్సుకున్న చాపల్యం నెమ్మదిగా అణిగిపోతాయి. ఆ చైతన్యం అటువంటిది, దాని ప్రవాహం అటువంటిది. అది శాంతి ప్రవాహం, కాంతి ప్రవాహం.

చలం గారు అంటూ ఉంటారు భగవాన్ ఎవరో నాకు అక్కర్లేదు, భగవాన్ ఏమిటో నాకు అక్కర్లేదు, భగవాన్ ఎందుకో నాకు అక్కర్లేదు. ఆయన నాకు ఆనంద సముద్రం. ఆయన నుండి నాకు కాంతి, శాంతి వస్తున్నాయి. ఆయన దగ్గర నుండి నేను ఏది పొందుతున్నానో అది నాకు కావాలి. ఆయన అవతార పురుషుడు అవునో, కాదో నాకు

అక్కర్లేదు. ఆయన దగ్గర నుండి నేను డైరెక్ట్ గా ఏది పొందుతున్నానో అది నాకు కావాలి అనేవారు. లోపల చైతన్యం శాంతి లేకుండా ఉండదు, కాంతి లేకుండా ఉండదు. ఆ శాంతి ప్రజ్వలించినప్పుడు, ఆత్మ జ్యోతి ప్రజ్వలన జరిగినప్పుడు, ఎక్కడవి అక్కడ ఉండిపోయి, వాడి silence చూసి enjoy చేస్తాయి. ఏనుగుని నిగ్రహించాలి అంటే సింహం మాత్రమే నిగ్రహించగలదు. ఇంకొక జంతువు ఏది ఏనుగుని నిగ్రహించలేదు. సింహం అంటే ఎవరు అనుకుంటున్నావు? అహంకారం ఏమో ఏనుగు, సింహం అంటే గురువే. గురువులో శాంతి ఉంటుంది, ఆ శాంతి లోంచి శక్తి ఉద్భవిస్తుంది. ఆ శక్తి ఈ అహంకారం అనే ఏనుగుని పడగొట్టాలి కానీ, బాహ్య ప్రక్రియల వల్ల అది పడదు. లేడికి, లొట్టిపిట్టలకి ఏనుగు లొంగుతుందా? లొంగదు. ఒక్క సింహానికి మాత్రమే లొంగుతుంది. ఈ ముక్కు మూసుకోవటం వల్ల అహంకారం లొంగదు. గురువు అనుగ్రహం అనే సింహానికే ఈ అహంకారం అనే ఏనుగు లొంగుతుంది. అతని చూపు చాలు, మాటల తోటి పనిలేదు. గురువు చూపు సరిపోతుంది. అది వెర్రి చూపు కాదు, అది శవ చూపు కాదు. ఆ నేత్రాల ద్వారా చూసేది అహంకారం కాదు.

రమణమహర్షి గారు అనేవారు నీతోటి ఆడుకున్న వెంకట్రామన్, నువ్వు ఎరుగున్న వెంకట్రామన్ ఇక్కడ లేడు. ఇక్కడున్న వాడు ఎవడో నీకు తెలియదు. నేను చెప్పినా నీకు అర్థం కాదు. అంటే జీవుడికి పరమాత్మ గురించి తెలియదు. మరి జీవుడికి పరమాత్మ గురించి ఎప్పుడు తెలుస్తుంది? వీడు కూడా పరమాత్మ అయినప్పుడే తెలుస్తుంది. ఒక జ్ఞాని గురించి ఎప్పుడు తెలుస్తుంది మనకి? మనం కూడా జ్ఞానం సంపాదించినప్పుడు తెలుస్తుంది. కాని మనకి జ్ఞానం కలగకపోతే తెలియదు. ఎందుచేత అంటే జీవ లక్షణాలు ఉన్నవాడికి, egosense ఉన్నవాడికి, egoless state గురించి తెలియదు. ఎంత ప్రయత్నం చేసినా అర్థం కాదు. అతని చూపు చాలు, అహంకారం అనే ఏనుగు గజగజలాడి, గిజగిజ కొట్టుకుని చస్తుంది. వాడు గురువు. ఆ గురువు చూపు సింహం తోటి సమానం. ఆ చూపు ఎప్పుడైతే పడిందో, ఈ శిష్యుడి యొక్క అహంకారం గజగజలాడి, గిజగిజ కొట్టుకుని చస్తుంది అన్నారు. ఆ చూపు అంత బలీయమైనది. లోపల ఉన్నవాడు ఎవడు? ఈశ్వరుడు. మీకు అసాధ్యం ఉంది, నాకు అసాధ్యం ఉంది కానీ ఈశ్వరుడికి అసాధ్యం అంటూ లేదు. ఈశ్వరుడి dictionaryలో అసాధ్యం అంటూ ఏది లేదు. ప్రతీది సాధ్యమే ఈశ్వరుడికి. ఈశ్వర

అనుగ్రహం పొందిన వాడిని జ్ఞానం అనేది సహజంగానే వరిస్తుంది.

మనం చేసే ప్రయత్నం అంతా కూడా, మనం చేసే సాధన అంతా కూడా, మనం చేసే పూజ అంతా కూడా, మనం చేసే జపం అంతా కూడా, ఈశ్వర అనుగ్రహం పొందడం కోసమే, అనుగ్రహం లేకపోతే ఆత్మజ్ఞానం కలగదు, ఆత్మానుభవం కలగదు, ఆత్మ వైభవం తెలియదు. దేవుడి అనుగ్రహం లేకుండా దేవుడి యొక్క మాట విలువ కూడా తెలియదు. మనకి దేవుడు కూడా వెళ్లాలని ఉంది కానీ మనకి అజ్ఞానం విడిచి పెట్టాలని లేదు. నన్ను వెంబడించాలి అని నువ్వు అనుకున్నప్పుడు నీ అజ్ఞానాన్ని నువ్వు విడిచి పెట్టవలసిందే. నీ అజ్ఞానాన్ని నువ్వు విడిచి పెట్టకపోతే నన్ను నువ్వు వెంబడించలేవు అంటున్నాడు భగవంతుడు. ఎక్కడో వైకుంఠం లేదు, ఎక్కడో కైలాసం నీకు దూరాన లేదు. ఏదైతే ఇప్పుడు నేను నేను అంటున్నావో ఈ నేను అనే తలంపు కొంచెం కూడా, slightestగా కూడా ఎక్కడైతే లేదో, అక్కడే వైకుంఠం ఉందని, అక్కడే కైలాసం ఉందని, అక్కడే ముక్తి స్థానం ఉందని, అక్కడే మోక్ష స్థితి ఉందని, అక్కడే స్వర్గ రాజ్యం ఉందని, అక్కడే నిర్వాణ స్థితి ఉందని, నీ సాధన పండిన తరువాత గురువు అనుగ్రహం వలన నేను అనే తలంపు కొంచెం కూడా లేని చోటే వైకుంఠం అన్న సంగతి అదే మోక్ష స్థితి అని నీకు అనుభవంలోకి వస్తుంది. ఎక్కడో ఉంది అనుకున్నది ఇక్కడే ఉందని, ఎప్పుడో వస్తుంది అన్నది ఇప్పుడే వచ్చేసింది అన్న సంగతి నీకు ఈశ్వరానుగ్రహం పొందిన తరువాత నీకు తెలుస్తుంది. ఇదొక పోరాటం. ఆత్మస్థితిని మీకు అందజేయటం కోసం, ఇప్పుడు మీరు దేనితోటి అయితే తాదాత్మ్యం పొందుతున్నారో, ఆ తాదాత్మ్యం లోంచి మీ మనసుని విడదీసి ఆయన చెప్పే teaching యొక్క విలువ మీ మనసుకి అందజేసి, మీ బుద్ధికి అందజేసి, ఇక్కడే ఈ శరీరంలో ఉండగానే మీకు ఆత్మానుభవం పొందటం కోసం చెబుతున్న బోధ. దీనికి లౌకికమైన ప్రయోజనాలు ఏమీ లేవు.



**మనం చేసే మంచి పని అయిష్టంతో కాకుండా ఇష్టంతో చెయ్యాలి. దాని వలన మెదడుకు, హృదయమునకు సమన్వయము కుదురుతుంది. అట్టివాడు యోగి అవుతాడు.**

మీ హృదయంలో కైలాసం ఉంది. ఉన్నదంతా మీ హృదయంలోనే ఉంది. సద్వస్తువు ఎక్కడ ఉంది? నీ హృదయంలోనే ఉంది. కానీ నీ హృదయంలో ఉన్న ఆ సద్వస్తువుకి రూపం లేదు, నామం లేదు. నీ శరీరానికి ఆకారం ఉంది. కానీ అహంకారానికి మూలంలో ఉన్న దానికి ఆకారం లేదు. ఆకారానికి పరిమితం అయిన నీవు ఆకారం లేని దానిని అర్థం చేసుకోలేకపోతున్నావు. అర్థం చేసుకోలేక అదే లేదని నువ్వు అంటున్నావు. ఎంత క్లారిటీ చూడండి. ఆ scientific ఎనాలిసిస్, ఆ mathematical accuracy మీరు చూడండి. అంటే సబ్జెక్టు మీరు ఎంజాయ్ చేస్తారు అని చెబుతున్నాను. నీకు నేను అనే తలంపు ఉంది. దానికి మూలం నీ లోపలే ఉంది. నీ శరీరానికి ఏ విధంగా అయితే ఆకారం ఉందో, నువ్వు ఉపాసించే దేవుడికి ఏ విధంగా అయితే ఆకారం ఉందో, నేను అనే తలంపుకి కూడా ఒక మూలం ఉంది. కానీ ఆమూలానికి మటుకి ఆకారం లేదు. నువ్వు ఏదో ఒక ఆకారానికి తాదాత్మ్యం చెందడానికి జన్మజన్మల నుంచి అలవాటు పడి ఉన్నావు. ఇప్పుడు ఆకారం లేని ఆ మూలాన్ని అందుకోవటం నీకు కష్టంగా ఉంది. అది నీకు అర్థం అయ్యేలా చెప్పి, నీ బుద్ధికి గ్రహించే శక్తి కలుగజేసి, నీ చెయ్యి పట్టుకుని అక్కడకు తీసుకుని వెళ్ళడం కోసం వస్తాడు. వాడే గురువు, వాడే జ్ఞాని.

రూపదృష్టి, నామదృష్టి లోంచి మనం మనసుని విడదీయలేము. అలా విడదీయ డానికే గురువు సహకరిస్తాడు. గురువు చెప్పిన మార్గంలో నువ్వు ప్రయాణం చెయ్యడం ప్రారంభించు. అనుగ్రహం దానంతట అదే వస్తుంది. అది automatic Devine action. మామూలుగా కాలువ పక్కన షట్టర్ ఎత్తితే పొలాల్లోకి నీరు ఎలా వెళ్ళిపోతుందో, అదే విధంగా గురువు చెప్పిన మార్గంలో ఎప్పుడైతే ఒక్క అడుగు ముందుకి ప్రయాణం చేశావో, గురువు అనుగ్రహం దానంతట అదే వచ్చేస్తుంది. నువ్వు ఎప్పుడైతే ఈశ్వరుడిని విశ్వసించటం ప్రారంభిస్తున్నావో, ఈశ్వరుడి సంకల్పం తోటే ఈ లోకం అంతా నడుస్తోంది అని ఎప్పుడైతే గ్రహిస్తావో అంటే నీ తెలివితేటల మీద నీకు నమ్మకం ఉండచ్చు కానీ నీ తెలివితేటల కంటే ఈశ్వరుడిని ఎక్కువగా ఎప్పుడైతే నువ్వు నమ్ముతున్నావో, ఎప్పుడైతే ఈశ్వరుడి పట్ల పరిపూర్ణ శరణాగతి పొందుతున్నావో, నేను అనే తలంపు యొక్క మూలాన్ని అన్వేషించడానికి నువ్వు ఎప్పుడైతే ప్రయత్నం చేస్తున్నావో, అప్పుడు అదను చూసుకుని పదును పెడతాడు. వాడు గురువు. ఇదంతా ఈశ్వరుడి వల్లే జరగాలి కానీ మన వల్ల ఏమి అవుతుంది, ఈశ్వరుడు ఎలా ఆడిస్తే మనం అలా ఆడగలం. దీంట్లో మన తెలివితేటలు ఏమున్నాయి. ఆయన

ఎక్కడ కూర్చోమంటే అక్కడ కూర్చోవాలి. ఎక్కడ నుంచోమంటే అక్కడ నుంచోవాలి. మనం బొమ్మలం మాత్రమే. ఈశ్వర సంకల్పానికి ఎదురు తిరగకుండా, ఈశ్వర సంకల్పాన్ని గౌరవించడం ఎప్పుడైతే నేర్చుకున్నావో, ఎప్పుడైతే ఆ శరణాగతి మార్గంలో నువ్వు ప్రయాణం చేస్తున్నావో, ఆ నేను అనే తలంపు యొక్క మూలాన్ని వెతకడానికి అన్వేషణ ఎప్పుడైతే ప్రారంభిస్తున్నావో, ఇదే అదను అనుకుని వాడిని పరిశీలించి, పరికించి, అప్పుడు వాడికి ఉపదేశం ప్రారంభిస్తాడు, వాడు గురువు. ఆ టైం చూసుకుని మాట చెబుతాడు. అప్పుడు ఆ మాట వాడికి పని చేస్తుంది. ఆ బ్రెయిన్ కి అర్హత వచ్చినప్పుడు, యోగ్యత వచ్చినప్పుడే గురువు ఉపదేశించడం ప్రారంభిస్తాడు.

రమణమహర్షి గారు కొంతమంది ఏమి అడిగినా మౌనంగా ఉండేవారు, మాట చెప్పేవారు కాదు. మనకి ఒకళ్ళ మీద ఒకళ్ళకి ఎక్కువ ప్రేమ ఉన్నప్పుడు ఎక్కువ మాట్లాడుకోవక్కర్లేదు. మనకి ఎవరి మీద అయితే ప్రేమ లేదో వాళ్ళతో ఎక్కువ మాట్లాడాలి. ఎందుచేత? వాళ్ళ మీద మనకి ప్రేమ లేదన్న సంగతి వాళ్లకి తెలియకుండా ఉండడం కోసం. మీ పట్ల నాకు affection ఉంది అనుకోండి, నాపట్ల మీకు affection ఉంది అనుకోండి మాటల తోటి పనేముంది? హృదయం హృదయంతో మాట్లాడినప్పుడు ఒకళ్ళ పట్ల హృదయంలో అభిమానం, ప్రేమ, ఆప్యాయత అవి ఉన్నప్పుడు మాటల తోటి పనేముంది? మాటల తోటి పని లేదు. మనిషికి శరీరంలో రకరకాల రోగాలు ఏవిధంగా అయితే ఉన్నాయో, మనసులో కూడా రకరకాల సంస్కారాలు ఉన్నాయి. ఒక్కొక్క సంస్కారం ఒక్కొక్క రకంగా అహంకారాన్ని వ్యక్తపరుస్తూ ఉంటుంది. వాళ్ళు భోజనం చేసి వచ్చారు అని మనకి తెలుసు. అయినా భోజనం చేస్తారా అని అడుగుతాం, అంటే వాడు భోజనం చెయ్యకూడదు, గౌరవం రావాలి. ఇది ఒకరకమైన సంస్కారం. మీకు అర్థం అవుతోందా? మీలో మీరు పరిశీలించుకోవాలి అని చెబుతున్నారు భగవాన్. శరీరంలో ఎక్కడ నొప్పి ఉన్నా రోగమే, ఇప్పుడు కాళ్ళకి రోగం వచ్చింది అనుకోండి మనకి ఎందుకు అని ఊరుకుంటామా. కాళ్ళు కూడా మన శరీరంలో భాగమే. లివర్ కి రోగం వచ్చింది అనుకోండి మనకి ఎందుకు అని ఊరుకుంటామా? లివర్ కూడా శరీరంలో భాగమే. అదే విధంగా మీలో ఏ రకమైన సంస్కారాలు ఉన్నా, ఆ సంస్కారం ఒక్కోరకంగా అహంకారాన్ని వ్యక్తం చేస్తూ ఉంటుంది. ఏ సంస్కారం ఈ అహంకారాన్ని ఏ విధంగా వ్యక్తం చేస్తోందో పరిశీలన చేసుకుని దాన్ని తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. అనాలసిస్ చూడండి, ఆ విశ్లేషణ చూడండి,

ఆ చెప్పటంలో క్లారిటీ చూడండి. కొంతమంది అవసరం లేకపోయినా మాట్లాడుతూ ఉంటారు. కొంతమంది వాళ్ళు చేసిన మంచి పనులు అన్నీ చెబుతూ ఉంటారు. అంటే వాళ్ళు చేసిన మంచిపనుల ద్వారా వాళ్ళ అహంకారాన్ని వ్యక్త పరచుకుంటున్నారు. ఇది ముందు మీరు గ్రహించండి, గుర్తించండి. రోగం ఏమిటో తెలియకుండా రోగం లోంచి మీరు బయట పడలేరు. అదే విధంగా ఏ సంస్కారం మిమ్మల్ని పీడిస్తోందో, ఏరకంగా మీ అహంకారం పీడిస్తోందో ఆ గుర్తించే శక్తి మీకు లేకపోతే అందులోంచి మీరు బయట పడలేరు.

ఏదో ఒక వాసన మీలో ఉంది అనుకోండి ఆ వాసన మీలో ఉన్నట్టు మీకే తెలియదు. కానీ పరమేశ్వరుడు మీకు తెలియకుండా లోపల దాక్కున్న వాసనని ఏదో ఒక జన్మలో దానిని బయటకి పంపుతాడు. నువ్వు లోపల దాక్కున్నావు, నువ్వు దాక్కుంటే వాడికి మోక్షం రాదు. నువ్వు ఉన్నట్లు వాడికి తెలియాలి, వాడికి తెలిశాక నిన్ను నశింప చెయ్యటానికి వాడు చూస్తాడు. అప్పుడు కానీ మోక్షం రాదు వాడికి అని ఆ hiddenగా ఉన్న వాసనను రెచ్చగొడతాడు. ఎప్పుడూ కూడా కనిపించే రోగం మంచిది, కనపడని రోగం ప్రమాదం. రోగం ఏమిటో తెలిస్తే దానికి తగ్గ మందు వాడతాము. కొన్ని రోగాలు బయటకి కనపడవు. కానీ లోపల రోగం ఉంటుంది. వాడు రేపో, ఎల్లుండో చనిపోతాడు అనగా ఆ రోగం తెలుస్తుంది. అప్పుడు తెలిసినా వాడు చేసేది ఏమీ లేదు. కనపడని రోగాల కంటే కనిపించే రోగాలు మెరుగు, మందు వాడచ్చు. కనపడని రోగానికి మందు వాడడానికి అవకాశం లేదు.

భగవాన్ అన్నారు ఒకడి శరీరానికి కాన్సర్ వచ్చింది అనుకోండి, కాన్సర్ ఉన్నా కానీ ఉన్నట్లు వాడికి తెలియదు అనుకోండి వాడు మనలాగే సంతోషంగా ఉంటాడు, మనలాగే ఆనందంగా ఉంటాడు కానీ వాడికి జబ్బు ఉన్నట్టు వాడికి తెలియదు. అది ముదిరిపోయిన తరువాత, చావడానికి సిద్ధం అయ్యాక తెలుస్తుంది, అప్పటి వరకు వాడు ఆనందంగానే ఉంటాడు. సంసారం మనకి అలాగే ఉంది అంటున్నారు. కాన్సర్ జబ్బు ఉన్నవాడికి కాన్సర్ ఉందని తెలియకపోవటం వల్ల ఎంత సంతోషంగా ఉంటాడో, ఈ సంసారం అనేది జబ్బు అని, ప్రమాదం అని తెలియకపోవటం వల్ల మనం కూడా అంత సంతోషంగా ఉన్నాము. ఎవరి ముఖం చూసినా సంతోషమే. వాడికి జబ్బని తెలిస్తే కదా! పేషెంట్ కూడా వాడికి రోగం ఉందని తెలియకపోతే వాడు ఏనుగు మీద కూర్చున్నట్టు ఉంటాడు. పాపం వాడికి తెలియదు కదా వాడు ఏమి చేస్తాడు? అదే విధంగా మనం అందరం కూడా ఈ సంసార

గొడవల్లో చాలా సంతోషంగా ఉన్నాము. ఇంత సంతోషంగా ఉండడానికి మరొక కారణం ఏదీ లేదు. ఇది జబ్బు అన్న సంగతే మనకి ఎరుకకి రాలేదు. రూపదృష్టి, నామదృష్టి అనేది ఒక జబ్బు. అది జబ్బన్న సంగతి కూడా మనకి తెలియడం లేదు. అసలు గుర్తింపుకి రాలేదు, అందుచేత సంతోషంగా ఉంటున్నాము. జన్మించటం, మరణించటం అనేది ఒక సంసారమే. ఆ సంసారం జబ్బు అన్న సంగతి కూడా మనకి ఎరుకకి రాలేదు. అందుచేత సంతోషంగా ఉన్నాము. అందులో ఉన్న నిస్సారతని, అందులో ఉన్న అశాంతిని, అందులో ఉన్న అల్పత్వాన్ని, అందులో ఉన్న స్వల్పత్వాన్ని గురువు నీకు ఎత్తి చూపించి అప్పుడు నిన్ను హృదయాభిముఖంగా ప్రయాణింపజేస్తాడు వాడే గురువు.

నా లోపల ఉన్న వాసనలను చెప్పడంలో నీ గొప్పతనం ఏమీ లేదు. కానీ ఆ వాసన తొలగించవలసిన బాధ్యత కూడా నీదే ఓ అరుణాచలేశ్వరుడా, ఈ పని కూడా నువ్వే పూర్తిచేసి పెట్టాలి. కానీ నా ప్రార్థన ఏమిటి అంటే, నా రిక్వెస్ట్ ఏమిటి అంటే నా వాసన తొలగించడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. కానీ సగంలో మటుకు విడిచి పెట్టేయకు. ఆ వాసనను శేషం లేకుండా నశింపచేసే వరకు నువ్వు విడిచి పెట్టకు. మీలో రకరకాల సంస్కారాలు ఉన్నాయి. మీలో రకరకాల తలంపులు ఉన్నాయి. రకరకాల కోరికలు ఉన్నాయి, ఇవన్నీ ఉన్నాయి కదా, ఇవన్నీ కూడా ఒక్కొక్క రకంగా వ్యక్తం అవుతూ ఉంటాయి. చెవిలో పోటు ఒక రకంగా ఉంటుంది. కడుపు నొప్పి ఒక రకంగా ఉంటుంది, కాళ్ళు లాగడం ఒక రకంగా ఉంటుంది, కళ్లు మంటలు ఒక రకంగా ఉంటాయి. అలాగే మీ యొక్క సంస్కారాలు ఒక్కొక్క రకంగా మీ అహంకారాన్ని వ్యక్తపరుస్తూ ఉంటాయి. ఏ సంస్కారాలు ఏ రకంగా అహంకారాన్ని వ్యక్తపరుస్తున్నాయో అవన్నీ జాగ్రత్తగా చూసుకుని, భూతద్దం పెట్టి వస్తువుని చూసినట్టు జాగ్రత్తగా చూసుకుని ఒకటి తరువాత ఒకటి తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యాలి. నువ్వు ప్రయత్నం మొదలుపెట్టు సరిపోతుంది. గురువు అనుగ్రహం, ఈశ్వర

**నువ్వు ఎవరికైతే దానం చేసావో వాళ్ళ దగ్గర నుంచి నువ్వు ఏదో ఒకటి ఆశించి కనుక చేస్తే అది వ్యాపారం అవుతుంది.**



అనుగ్రహం దానంతట అదే వస్తుంది. నీకు నువ్వు సహాయం చేసుకోవడానికి ప్రయత్నించు. అప్పుడు ఈశ్వరుడు నీకు సహాయం చేస్తాడు. ముందు నీకు నువ్వు సహాయం చేసుకోవటం కోసం కొంచెం ప్రయత్నం చేసుకో, నీ సంస్కారాలు remove చెయ్యటం కోసం, నిన్ను నువ్వు పవిత్రుడిని చేసుకోవటం కోసం ఎప్పుడైతే నీకు నువ్వు సహకరించుకుంటున్నావో అప్పుడు ఈశ్వర సహకారం కూడా నువ్వు అడగక్కరలేదు, దానంతట అదే వస్తుంది.

నీ లోపల ఉన్న అజ్ఞానాన్ని ఒక్కొక్క సంస్కారం ఒక్కొక్క రకంగా వ్యక్త పరుస్తూ ఉంటుంది. ఈ సంస్కారాలు నీ లోపల ఉన్న అజ్ఞానాన్ని బయటకి తీసుకు వస్తున్నాయి. ఈ సంస్కారం ఈ రకంగా తీసుకు వస్తోంది కదా అని గ్రహించి ఏ సంస్కారం నీ అజ్ఞానాన్ని ఏ రకంగా తీసుకుని వస్తోందో ఆ సంస్కారాన్ని నువ్వు పట్టుకుని దానిని తొలగించుకోవడానికి నువ్వు ప్రయత్నం చెయ్యి. అప్పుడు మీకు లాభం ఏమిటి అంటే, ఎప్పుడైతే నువ్వు నీ అహంకారం యొక్క విజృంభణ ఆపుచేస్తున్నావో, అప్పుడు నీకు నిగ్రహం ఏర్పడుతుంది. నిగ్రహం పెరిగే కొలది ఆగ్రహం తగ్గుతుంది. నిగ్రహం నీకు ఎప్పుడు వస్తుంది? నీలో ఉన్న సంస్కారాలను తొలగించుకోవడానికి నువ్వు ఎప్పుడైతే ప్రయత్నం ప్రారంభించావో అప్పుడు నీకు ఆ కంట్రోల్ వస్తుంది. We have to study our desires, study our impulses, and control our emotions. Not comfort but control is happiness. నీకు ఎంత ఐశ్వర్యం ఉన్నప్పటికీ, నీకు నిగ్రహం లేకపోతే నువ్వు సుఖపడవు. ఎప్పుడైతే నీ సంస్కారాలు remove చేసుకోవడానికి, తొలగించుకోవడానికి ప్రయత్నం చేశావో, నిగ్రహం కూడా నీకు కలుగుతుంది. అప్పుడు నిగ్రహశక్తి నీకు కలుగుతుంది.

భగవాన్ "నేనెవడు?" అనే ప్రశ్న వేసుకోమన్నారు కదా, ఆ ప్రశ్న కూడా ఎందుకు అంటే అంకుశానికి ఏవిధంగా అయితే ఏనుగు జడుస్తుందో, అదే విధంగా నేను ఎవరు అనే ప్రశ్న కూడా మనసుకి అంకుశం లాంటిది. అంటే మనసు బాహ్యంగా విజృంభించకుండా అంకుశం లాగా అది ఉపయోగపడుతుంది, ఏది? నేను ఎవడు అనే ప్రశ్న. ఈ సంస్కారాలు ఎలా ఉంటాయో చెప్పమంటారా? ఒక చిన్న ఉదాహరణ చెబుతాను ఈ మధ్య ఒకచోట భోజనం చేస్తున్నాను. ఒకరు అన్నం కావాలి అని అడిగారు. ఆయన అన్నం అడుగుతున్నారు వడ్డించండి అనాలి కానీ అక్కడున్న పెద్ద మనిషి ఏమంటున్నాడు అంటే వాడు అడిగేది అన్నమే కదా వడ్డించు అంటున్నాడు, అంటే బూర్లు అడిగితే వడ్డించరేమో. అంటే లోపల

ఉన్న అజ్ఞానం ఆ మాట ద్వారా ఎలా వ్యక్తం అవుతుందో చూడండి. అన్నం అడుగుతున్నారు అన్నం వడ్డించండి అనాలి. అక్కడితోటి ఆగిపోవాలి కానీ లోపలున్న అజ్ఞానం ఎలా వ్యక్తమవుతోందో చూడండి. ఆయన తెలివి తక్కువ వాడు, మూర్ఖుడు కాదు. ఆ సంస్కారం ఒక్కొక్కసారి సడన్ గా సైకిల్ ట్యూబ్ లాగా పేలిపోతుంది. అదే ఇక్కడ భగవాన్ చెబుతున్నారు మనం జాగ్రత్తగా ఉండాలి పేలిపోతాయి సంస్కారాలు అని, ఆ మైండ్ లో ఉన్న disorder చూడండి. అంటే అక్కడ ఏదో లోభిత్వం, ఏదో అనారోగ్యం, ఆ మనసులో ఉన్న సంస్కారం అలా వ్యక్తం అవుతోంది. నీ లోపల అజ్ఞానం ఉన్నంతసేపు, నీలోపల అహంకారం ఉన్నంతసేపు, నువ్వు ఎంత దాచుకున్నా అది ఏదో ఒక రకంగా వ్యక్తం అవుతుంది అని చెప్పడం కోసం చెబుతున్నారు. మనం ఎంత దాచుకుందాం అన్నా అది burst అవుతూ ఉంటుంది. కొంతమంది కోపం దాచుకుంటారు కానీ ఆ టైం వచ్చేటప్పటికి అది అలా వచ్చేస్తూ ఉంటుంది. వాళ్ళ కళ్లల్లో, ఆ కంఠ స్వరంలో అది వ్యక్తం అయిపోతూ ఉంటుంది.

కొంతమంది చుట్టాలు వచ్చినప్పుడు జాగ్రత్తగా ఉంటారు. చుట్టాలు వచ్చినప్పుడు కోపం చూపించరు. చాలా నాగరికత చూపిస్తూ ఉంటారు, మర్యాద చూపిస్తూ ఉంటారు. మాటలు నాజూకుగా మాట్లాడుతూ ఉంటారు. అది ఒరకమైన అహంకారం. ఇవన్నీ పరీక్ష చేసుకోమని చెబుతున్నారు. ఆ చుట్టాలు గుమ్మం దాటి వెళితే అన్నీ మామూలే. అంటే ఈ వాసనలు ఎలా ఉంటాయో జాగ్రత్తగా మీరు observe చేసుకుంటూ ఉంటే, ఆ వాసన యొక్క వికారం మీకు తెలుస్తుంది. తరువాత మీరు తొలగించుకోవడానికి ప్రయత్నం చెయ్యవచ్చు. X-ray తియ్యడం ఎందుకు? రోగం ఉందో లేదో తెలుసుకోవడానికే కదా. మీరు మాట్లాడే మాటలు ద్వారా మీరు చేసే పనుల ద్వారా, మీ expression ద్వారా, మీకున్నటువంటి ఆ సంస్కారాలు చూసుకుంటూ ఉంటే మీకే తెలుస్తుంది. అందుచేత నువ్వు సాధన చెయ్యగా, చెయ్యగా, మీకు గుర్తించే శక్తి రాగా, రాగా ఈశ్వరుడి పట్ల మీకు చలనం లేని విశ్వాసం కలగగా, భగవంతుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, ఈశ్వరుడు అనేవాడు ఒకడు ఉన్నాడు, మన హృదయంలో ఒక నిజం ఉంది, దానికి చావు లేదు అనే విశ్వాసం మీ హృదయంతరాళాల్లోంచి, ఆ లోతుల్లోంచి, పొంగి పొంగి ఆ విశ్వాసం వచ్చి మీ శిరస్సుని ముంచుతున్నప్పుడు, ఆ విశ్వాసంలోంచి ఒక శక్తి మీకు కలుగుతుంది. ఎప్పుడైతే మీకు భగవంతుడు పట్ల సజీవమైన విశ్వాసం కలిగిందో, ఆ విశ్వాసం నుంచి ఒక శక్తి కలుగుతుంది.

ఆ శక్తి మీ సంస్కారాల తోటి పోరాడి, మీ సంస్కారాలను బయటకి లాగి మంట పెడుతుంది, అప్పుడు నువ్వు జ్ఞానివి అవుతావు. ఇప్పుడు నీ సంస్కారాల తోటి నువ్వు పోరాడుతున్నావు కానీ ఈ శక్తి నీకు సరిపోదు. ఈశ్వరుడి పట్ల అచంచలమైనటువంటి, గురువు పట్ల, గురువు చెప్పిన మాటల పట్ల అచంచలమైన విశ్వాసం నీకు కలిగినప్పుడు ఆ శక్తి నీకు అభివృద్ధి అవుతుంది, ఆ శక్తి విజృంభించి ఏమి చేస్తుంది అంటే నీ సంస్కారాలను బయటకి లాగి మంట పెడుతుంది.

**అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా**

**పేరు దలపగనే పట్టి లాగితివి నీ మహిమ కనుదురెవరరుణాచలా**

**అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా**

**తిండిని నిన్జేరి తిని తిన నా నేను శాంతమై పోవుదు నరుణాచలా**

**అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా**

**గిరిరూపమైనట్టి కరుణా సముద్రమా కృప జేసినన్నేలుమరుణాచలా**

**అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచల శివ అరుణాచలా**

**హే భగవాన్, జయ భగవాన్, ప్రియ భగవాన్, ప్రభు భగవాన్**

**ఓం ఓంఓంఓంఓంశాంతిఃశాంతిఃశాంతిః**

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక

**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి**

అకౌంట్ నెంబర్ **520101264185724** **(IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.



# శ్రీమద్భగవద్గీత

**(సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

**తస్మాత్ త్వముత్తిష్ఠ యశో లభస్వ ।**

**జిత్వా శత్రూన్ భుంక్ష్వ రాజ్యం సమృద్ధం ॥**

**మయైవైతే నిహతాః పూర్వమేవ ।**

**నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ ॥ 11:33 ॥**

**తాత్పర్యము :** ఓ సవ్యసాచీ! లెమ్ము, కీర్తి గాంచుము, శత్రువులను జయించి సర్వసంపదలతో తులతూగు రాజ్యమును అనుభవింపుము. వీరందరును నాచేతనే ఇంతకు పూర్వమే హతులైనారు. నీవు నిమిత్తమాత్రుడవు కమ్ము.

అర్జునా నువ్వు జయం సంపాదిస్తావు అని నేను చెపుతున్నాను. నేను ఎంత చెప్పినా నీ ప్రక్కనే నేను ఉన్నా యుద్ధానికి వెళ్ళినవాడు చనిపోతాడో లేకపోతే ఇంటికి వస్తాడో తెలియదు. ఒకవేళ నిజంగా నువ్వు చనిపోతే, నీకు నష్టము ఏమీ లేదు. ఒక ధర్మం నిమిత్తం నువ్వు పోరాడావు కాబట్టి నువ్వు స్వర్గానికి వెళ్తావు. ఒకవేళ జయించావు అనుకో, నీకు రాజ్యం వస్తుంది. ఏదైనా బాగానే ఉంది. అదీ లాభమే, ఇదీ లాభమే అన్నాడు.

అయితే, భీష్ముడు మా తాతగారు, ద్రోణాచార్యుడు మా గురువుగారు, అంత పెద్దవాళ్లని నేను ఎలా జయించగలను అని నీకు అనిపిస్తూ ఉంటుంది. అర్జునుడు ద్రోణాచార్యుడి దగ్గర విద్య నేర్చుకున్నాడు. భీష్ముడు కౌరవులని పాండవులని పోషించటం, వీళ్ల మీదకి ఎవరైనా యుద్ధాలకి వస్తుంటే వాళ్లతో పోరాడటం, ఇలా కష్టపడ్డాడు కాని, తాతగారికి జీవితంలో అసలు సుఖం లేదు. భీష్మాచార్యులకి లోకంలో గొప్ప పేరు ఉంది, భక్తులలో ప్రహ్లాదుడి తరువాత భీష్ముడి పేరు చెపుతారు, ఈ భీష్ముడిని ఎలా చంపగలను ద్రోణాచార్యుడిని ఎలా చంపగలను అనుకొంటున్నాడు అర్జునుడు. అప్పుడు కృష్ణుడు అంటాడు, వీళ్లందరినీ ఎలా చంపగలను అని నువ్వు అనుకొంటున్నావు. అయితే నువ్వు ఎవరినైతే చంపుదాము అనుకొంటున్నావో అర్జునా, వాళ్లందరినీ ముందే చంపి పోగులు పెట్టి ఉంచాను. నువ్వు ఊరికే చేతులు ఆడించు. పని నాది, గౌరవం నీది అన్నాడు. ఇక్కడే ఉంది వైభవమంతా! ఈ ఒక్క మాట మీరు అర్థం చేసుకోండి.

ఇది ఒక్క అర్జునుడికే వర్తించదు, మనందరికీ వర్తిస్తుంది. మనము ఏదైనా సాధించాము అనుకోండి అది ఈశ్వర సంకల్పాన్ని బట్టి సాధించాము కాని, మన తెలివితేటలని బట్టి సాధించాము అని మీరెవరూ అనుకోవద్దు. అలా అనుకొంటే మనం పాడైపోతాము. ఎవరినైతే నువ్వు చంపుదాము అనుకొంటున్నావో వాళ్లందరినీ చంపేసి పోగులు పెట్టి ఉంచాను, నువ్వు చేతులు ఆడించు అన్నాడు కృష్ణుడు. అర్జునుడు అంతటి పెద్దవాడిని, మన భారతదేశంలో జన్మించినటువంటి మహావీరులలో ఒకడు అయినటువంటి అర్జునుడినే అలా అంటే మనం ఏ పాటి వాళ్లం! అర్జునుడితో పోల్చుకుంటే మనం ఎంతటి వాళ్లం! అర్జునుడంతటి వాడిని పట్టుకొని, నిమిత్తమాత్రం భవ సవ్యసాచిన్ అన్నాడు కృష్ణుడు.



**శ్రద్ధ అంటే, ఆచార్యులు వారు ఏమి చెప్పారంటే, భగవంతుడు చెప్పిన వాక్యం పట్ల మీకు నూటికి నూరు పాళ్ళు నమ్మకం కలిగి, అలా జీవించాలి.**

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**
**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**
IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

# కాలము

మన ఇంట్లో 2023 సంవత్సరం కేలెండరులోని పన్నెండు నెలలను వెనుకకు త్రిప్పి మరొక నూతన సంవత్సరం 2024లోకి ప్రవేశించాం. మన దేహము పుట్టినది మొదలు ఇప్పటివరకు అనేక సంవత్సరాలు కాలగర్భంలో కలిసిపోయాయి. కాలానికి ముందుకు సాగడమే తప్ప వెనుకకు వెళ్ళడం తెలియదు. గతించిన కాలము ఒక్క క్షణము కూడా తిరిగి రాదు. పరమాత్మ మనకు ప్రసాదించిన మానవ జీవితము కాలరూపంలో ఉంది. అట్టి కాలము సాక్షాత్తు పరమాత్మ స్వరూపమే! ఈ సృష్టిలో వెలకట్టలేనిది కాలము. కాబట్టి పరమాత్మ ప్రసాదించిన ఈ మానవ జీవితాన్ని లక్ష్య సిద్ధికై సద్వినియోగం చేసుకోవాలి. మంచి పనులు చేసుకునే మహత్తర అవకాశం ఈ మానవ జన్మ. మనకు సద్గురువు లభించారు కాబట్టి, వాస్తవంగా నేను ఎవరో తెలుసుకుని అమర స్థితిని పొందే సువర్ణావకాశం ఇది. మానవ జన్మ మోక్ష ద్వారం. జన్మ సాఫల్యానికి త్రికరణాలను అనగా తలంపు, మాట, చేతలను జాగరూకతతో ఉపయోగించుకోవాలి. బొగ్గు యొక్క మాలిన్యం, నలుపు రంగు పోవాలంటే పాలతో ఎన్నిసార్లు కడిగినా పోదు. నిప్పను అంటిస్తే అది ఎర్రగా తయారైమండుతూ వెలుతురును, కాంతిని ఇస్తుంది. అట్లే మనము చేసే కర్మలకు 'స్వరూప-జ్ఞానం' అనే నిప్పను తగిలించాలి. మనకు కోరికలు కోరుకోవడం ఎలాగూ అలవాటు ఉంది కాబట్టి నీవే కావాలి అని పరమాత్మనే కోరుకోవాలి. బాహ్యంలో చూడడం ఎలాగూ అలవాటు ఉంది కాబట్టి సర్వత్రా పరమాత్మనే చూడడం నేర్చుకోవాలి. కోపం ఎలాగూ ఉంది కాబట్టి మన స్వరూపం తెలియకుండా అడ్డుగా నిలిచే అహంకారం మీద కోప్పడాలి. అత్యాశ ఎలాగూ ఉంది కాబట్టి పరమాత్మనే ఆశ పడాలి. ధనాన్ని ఎలాగూ లెక్కించే అలవాటు ఉంది కాబట్టి పరమాత్మ నామాలను లెక్కించాలి. అనగా మన భావోద్రేకాలను పరమాత్మ పరంగా మలచుకోవాలి. స్వరూప సచ్చిదానంద స్థితికి అడ్డు వచ్చేది మన అహంకారమే, మన స్వార్థమే. వ్యవహార దృష్టిని అతిక్రమించి స్వరూప ఎరుక కలిగేవరకు జనన మరణ చక్రము, దుఃఖము, అశాంతి నుండి విడుదల పొందలేము. "ఒక కాలములో పరమాత్మచే ప్రసాదింపబడిన ఈ మానవ శరీరాన్ని సద్వినియోగం చేసుకుని కాలాతీత సద్వస్తువును తానుగా అనుభవైకవేద్యం చేసుకోవాలి" అన్నదే మన గురుదేవులు సద్గురు శ్రీనాన్నగారి బోధ.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# నిజమైన సౌందర్యం హృదయపవిత్రతలోనే ప్రకాశిస్తుంది.

సచ్ఛీలం నిజమైన అందం. శరీరం రంగు బంగారంలా ఉన్నా అది మట్టే నశించిపోతుంది. ఇందులోగల సూక్ష్మశరీరం సంస్కారాలను పోగుజేసుకొంటూ పెరుగుతుంది. శరీరం పనికిమాలింది. ఇంద్రియసంబంధమైన వికారాలకు లోబడుతుంది. ఆత్మ శాశ్వతం కానిదాన్ని గురించి పట్టించుకోలేనివాడు జన్మచక్రంలో తిరుగుతూ ఉంటాడు. చిత్తమునకు వీడ్కోలు చెప్పి ఆత్మ సమర్పణ చేసేవాడికి మరణంలేదు. కటిక చీకటిలో చిన్న కొవ్వొత్తి కాంతి ఎంతో దూరం ప్రసరిస్తుందో అలాగే మిక్కిలి దుర్మార్గమైన ప్రపంచంలో మంచి పనికూడా అంతే గొప్పగా ప్రకాశిస్తుంది. ఎవరి బుద్ధి ఔదార్యము వైరాగ్యరసంలో నిండి ఉంటుందో ఆ ఆనందమయులే పరమసాధకులు. నీతినియమాలు లేనివాడు జీవితగమ్యం తెలియనివాడు ధార్మికంగా పురోగమించలేడు. సహజంగా జీవిస్తే వైరాగ్యము వికసితమౌతుంది. కావలసిన కనీస అవసరాలకు మించి ఎక్కువగా కోరుకోవటం పిచ్చి రేపుతుంది. అసలు మన భౌతిక అవసరాలు తీరిన తరువాత అంతకుమించి సంపద ఎందుకు? వానప్రస్థ ఆశ్రమానికి బయలుదేరుతున్న దంపతులకు అడవిలో బంగారుపు కడ్డీ కనబడితే భార్య వ్యామోహపడుతుందని గొయ్యితీసి కప్పెడుతూ ఉంటే భార్య విషయం తెలుసుకొని భర్తతో “మట్టిని మట్టితో కప్పెడుతున్నారా?” అంది. మనస్సు కోరికలు లేని స్థితిని ఎలా పొందడమంటే ధ్యాననిధితో చిత్తంలోని సంస్కారాలు క్షీణింపచేసుకొని చిత్తం శాంతమై పరమాత్మని పొందే ఇచ్ఛ కూడా లేనప్పడే పరమాత్మ లభిస్తాడు. అప్పడు అనంత వెలుగులో ప్రకాశిస్తాము. శ్రీనాన్నగారు “చిత్తశుద్ధి అనే గేటు ద్వారానే సత్యాన్ని దర్శించాలి వేరే మార్గంలేదు. నీవు పరమ పవిత్రుడవైతే సత్యమే వెదుక్కుంటూ వస్తుంది” అన్నారు. ఎరుక అనే కవ్వంతో చిత్తంలోని మలినాలను చిలికితే నవనీతమనే వెన్న మనకు లభ్యమౌతుంది. పరమాత్మకు ఆ వెన్నే ఇష్టమని మనమనస్సు వెన్నగా చేసుకొంటే దాన్ని ఆయన తిని మన స్వరూపాన్ని ఎరుకపరుస్తాడు. మనం ప్రకృతి ధర్మానుగుణంగా సంచరించ గలగాలి. ప్రకృతి ఆశయం స్వాతంత్ర్యం. భార్యభర్తలు ఒకరిని ఒకరు ప్రేమించుకొంటున్నారు అంటే వారిలోని భగవంతుణ్ణి ప్రేమించుకొంటున్నారు ఈ సత్యాన్ని గ్రహించాలి గాని శారీరక ప్రేమ నిజం కాదు. భోగక్షేత్రంలో నాటబడిన బీజం ఆధ్యాత్మిక ఉన్నతిని మొలకెత్తనియ్యదు. అక్కడ అపజయం తప్పదు దీనికి ఉదాహరణ రుక్మిణి, సత్యభామల ఉదంతం కానవస్తుంది. రుక్మిణి భర్తను పరమాత్మగా ఎంచింది కలుసుకోవటం కాలవ్యవధి అయినా కలవరం రాలేదు. సత్యభామ శ్రీకృష్ణతులాభారంలో మణుగుల కొలదీ బంగారం వేసినా తూగలేదు. రుక్మిణి భక్తితో ఒక్క తులసి దళానికి పరమాత్మ తేలిపోయాడు. భక్తి బంగారం కన్న మిన్న. సోక్రటీస్ అంటాడు “నా దేహ వికారాలను చూడకండి నామాటల్లో సౌందర్యాన్ని ఆస్వాదించండి” అని. ప్రహ్లాదుడు రాక్షస వంశంలో జన్మించినా శ్రీహరి పాదాలను నిరంతరం స్మరించటం వల్ల ఎన్ని ఆపదల్లో నెట్టినా హృదయ పవిత్రత వల్ల ఆ భక్తికి చక్రి పరవశించాడు ప్రహ్లాదుని మాట నిలబెట్టటానికి అనంత ప్రకాశంతో స్థంభం నుండి వెలువడి దుష్టసంహారం చేసాడు. భక్తితో ప్రహ్లాదుడు అగ్రగణ్యుడిని చేసింది. ఏసు “హృదయశుద్ధి గలవారు ధన్యులు. వారు దేవున్ని చూచెదరు” అన్నాడు. అది నిత్య సత్యం.

- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966